

అలా.. ఎలా..?

టీచర్ల బదిలీల్లో గందరగోళం



బదిలీల కౌన్సెలింగ్‌లో ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- కేఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలకు నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు
- శింగనమల, యర్రగుంటలో ఖాళీలు చూపని వైనం
- ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులు
- తలలు పట్టుకుంటున్న విద్యాశాఖాధికారులు

టీచర్ల బదిలీల పక్రియ ముగిసిందని విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో కొత్త సమస్యలు వచ్చి పడుతున్నాయి. అవకతవకలపై అర్హత కలిగి నష్టపోయిన టీచర్లు ప్రశ్నిస్తున్నారు. వాటిని సరిదిద్దలేక, సమాధానాలు చెప్పలేక విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ గురువారం కూడా కేఎస్ ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల టీచర్లు.. డీఈఓను కలిసి విన్నవించుకున్నారు.

- అనంతపురం విద్య, ఆంధ్రజ్యోతి

ఏం చేయాలో..?

కేఎస్‌ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యవహారం విద్యాశాఖ మెడకు చుట్టుకుంటోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రిఫరెన్షియల్‌కు పోస్టులు కేటాయించడంపై బాధిత టీచర్లు ప్రశ్నిస్తున్నారు. న్యాయం చేయకపోతే కోర్టుకెళ్లడానికి సిద్ధమని తేల్చి చెబుతున్నారు. ఈవిషయంలో ఏమి చేయాలో అర్థంకాక విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లాలో ఇటీవల టీచర్ల బదిలీలు నిర్వహించారు. ఈసారి ప్రిఫరెన్షియల్ కేటగిరీ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలోని పోస్టుల్లో 50 శాతం మాత్రమే ప్రిఫరెన్షియల్ కింద అవకాశం కల్పించారు. ఆ మేరకే విద్యాశాఖాధికారులు ప్రిఫరెన్షియల్ కేటగిరీ పోస్టులను కేటాయించాల్సి ఉంటుంది. జిల్లాకేంద్రంలోని కేఎస్‌ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు పోస్టుల విషయంలో ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారు. ఇక్కడ ఆరు ఇంగ్లిష్ పోస్టులున్నాయి. వాటిలో మూడింటిని ప్రిఫరెన్షియల్ కేటగిరీ వారికి ఇవ్వాలి. మిగిలిన మూడింటిలో జనరల్ టీచర్లకు అవకాశం కల్పించాల్సి ఉంది. పాఠశాలలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వారు ఇప్పటికే ముగ్గురున్నారు. అయినా.. బదిలీల్లో మరో ఇద్దరికి అవకాశం కల్పించారు. దీంతో బదిలీల్లో మరో ఇద్దరు స్కూల్ అసిసెంట్లు ప్రిఫరెన్షియల్ కింద కేఎస్‌ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. దీంతో ఉన్న ఆరు ఇంగ్లిష్ పోస్టుల్లో ఐదుగురు ప్రిఫరెన్షియల్ టీచర్లు అయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా అవకాశం కల్పించడంతో తమకు అన్యాయం జరిగిందని జనరల్ సీనియర్ టీచర్లు వాపోతున్నారు. న్యాయం చేయాలని విద్యాశాఖాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గురువారం కూడా బాధిత టీచర్ ప్రశాంతమ్మ.. డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి, వినతిపత్రం అందజేశారు.

ఖాళీలు చూపకుండా..

శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు బయాలజీ స్కూల్ అసిసెంట్‌టీచర్లు ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆ ముగ్గురికి 8 ఏళ్ల సర్వీస్ పూర్తవడంతో బదిలీ కావాల్సి ఉంది. రేషనలైజేషన్‌లో ఒక బయాలజీ పోస్టు వెళ్లిపోగా.. రెండు మిగిలాయి. ఒక టీచర్ ఉద్యోగ విరమణకు ఏడాది ఉండడంతో బదిలీకి మినహాయింపు ఉంటుంది. ఆమెకూడా బదిలీకి దరఖాస్తు చేసుకుని, మరో మండలానికి వెళ్లారు. అపుడు అక్కడ రెండుబయాలజీ పోస్టులను ఖాళీ చూపాలి. విద్యాశాఖాధికారులు ఒక్క పోస్టునే ఖాళీ చూపడంతో అక్కడికి ఒకరు మాత్రమే వెళ్లారు. మిగిలిన ఒక బయాలజీ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. కణేకల్లు మండలం యర్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పోస్టులు మూడు ఉన్నాయి. ఒకటి రేషనలైజేషన్‌లో పోయింది. దీంతో మంజుల అనే జూనియర్ తెలుగు టీచర్‌ను బలవంతంగా బదిలీ చేసి, పంపించారు. అదే స్కూల్‌లో మరో తెలుగు టీచర్ రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోగా.. ఇతర మండలానికి మోడల్ స్కూల్ హెచ్‌ఎంగా వెళ్లారు. ఇపుడు అక్కడ ఒకే తెలుగు టీచర్ ఉన్నారు. ఈ రెండు ఉన్నత పాఠశాలల్లో వందలమంది విద్యార్థులున్నారు. సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో బోధన కుంటుపడుతోంది.

నానాటికీ తీసికట్టు

- ప్రభుత్వ పాఠశాలకు ఆదరణ కరువు
- ఏటేటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- కాశేపల్లిలో గత ఏడాది నుంచి ఒకే విద్యార్థి



కాశేపల్లిలో ఒక్క విద్యార్థి, ఒక్క ఉపాధ్యాయురాలు

పెద్దవడుగూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ఏటికేడు ఆదరణ కొరవడుతోంది. దీంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, రుచికరమైన ఆహారం, దుస్తులు, పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నా అటు వైపు వెళ్లే వారి సంఖ్య ప్రతి ఏడాది తగ్గుతోంది. మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, కస్తూర్బా గాంధీ పాఠశాల మొత్తం 47 పాఠశాలలు ఉన్నాయి. విద్యాబోధనకు 198 ఉపాధ్యాయులు ఉన్నారు. గతేడాది అధికారుల లెక్కల ప్రకారం 3491మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. పేద ప్రజల విద్యాప్రమాణాలు పెంచడం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. 2023-24 సంవత్సరంలో 4135 విద్యార్థులు, 2024-25 సంవత్సరం 3491 మంది విద్యార్థులు

(మిగతా 4లో..)

రేపు పీటీసీలో యోగాంధ్ర

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలు విరివిగా పాల్గొనాలి: కలెక్టర్ వినోద్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న జిల్లాకేంద్రంలోని పీటీసీలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో గురువారం కలెక్టర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలోని పీటీసీ మైదానంలో 21న ఉదయం 7 నుంచి 8 గంటల జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 5వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 23 లక్షల మంది జనాభా ఉండగా.. యోగాంధ్రలో భాగంగా ఇంటింటి సర్వే చేసి 9.97 లక్షల మంది పేర్లను నమోదు చేశామన్నారు. జిల్లా మొత్తం 100మంది మాస్టర్ ట్రైనర్లు, 6,504 మంది ట్రైనర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సంతకంతో ఎక్సలెన్సీగానీ, పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌గానీ జారీ చేస్తామన్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీల్లో వేదికలను ఏర్పాటు చేశామన్నారు. యోగంధ్రలో 10 లక్షల మంది దాకా జిల్లా ప్రజలు పాల్గొని, ప్రపంచ రికార్డు సృష్టించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, ఆయుష్ అధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించే పీటీసీ మైదానాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్యశాఖలో బదిలీల గోల

- మినహాయింపుల కోసం కోర్టుకు సంఘాలు
- సమీక్షించాలని న్యాయస్థానాల ఆదేశం
- కౌన్సెలింగ్‌లో కొనసాగుతున్న గందరగోళం
- ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి



అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ కోసం నిరీక్షిస్తున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ గోలగోలగా సాగుతోంది. జోనల్ కేడర్ల ఉద్యోగులను ఆర్డీ బదిలీ చేస్తున్నారు. జిల్లా కేడర్‌లో బదిలీల కౌన్సెలింగ్‌ను డీఎంహెచ్ఓ నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో తమ కార్యవర్గంలోని ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఉద్యోగ సంఘాలు కోర్టులను ఆశ్రయిస్తున్నాయి. మెడికల్ గ్రౌండ్, స్పౌజ్, అసోసియేషన్ లెటర్స్ తదితర మినహాయింపులు వర్తింపజేయాలని కోరుతున్నాయి. వాటిని పరిశీలిస్తున్న న్యాయస్థానాలు, సమీక్షించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశిస్తున్నాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు మినహాయింపులు వర్తింపజేస్తామని కౌన్సెలింగ్‌లోనే వైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. బుధవారం నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌ను సమీక్షిస్తామని చెప్పారు. కానీ అవేమీ జరగలేదని, అంతా గందరగోళంగా ఉందని ఉద్యోగ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విధుల్లో లేకుండా కౌన్సెలింగ్ కోసం రేయింబవళ్లు నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నాయి.

కోరుకున్న ప్రాతం దక్కుతుందా..?

కడప జోన్-4 పరిధిలో అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాలోని వైద్య, ఆరోగ్య కేంద్రాల ఉద్యోగులను బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే కోరుకున్న ప్రాంతాలు దక్కిన వారు ఆనందంగా ఉన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కౌన్సెలింగ్‌ను సమీక్షిస్తే (రివైజ్) తమకు కోరుకున్న ప్రాంతం దక్కుతుందా? అని మినహాయింపు వర్తించే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన స్థానాలను దక్కించుకున్న ఉద్యోగులు వదులుకుంటారా అన్న సందేహాలు

(మిగతా 5లో)

ప్రేమాయ చేశావే..!



పెళ్లంటే నూరేళ్ల పంట..! అందుకే అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూసి సంబంధం కుదుర్చుకోవాలని పెద్దలు చెబుతారు. కానీ ఇప్పుడు కనీసం ఒక్క తరాన్ని చూసే తీరిక కూడా యువతరానికి లేకుండాపోతోంది. సోషల్ మీడియాలో అమ్మాయి పరిచయమైతే చాలు.. అటువైపు ఎవరు..? ఎలాంటివారు..? అని ఆలోచించడం లేదు. ఇదే అదనుగా కొందరు ముగ్గులోకి దించి ముంచేస్తున్నారు. అనంతపురం నగరానికి చెందిన దేవేంద్ర నాయక్ ఇలాగే మోసపోయాడు. విజయవాడకు చెందిన రాజ్యలక్ష్మితో అనంతపురానికి చెందిన దేవేంద్ర నాయక్‌కు ఫేస్‌బుక్‌లో స్నేహం కుదిరింది. ఫోన్‌లో మాటలు కలిశాయి. 'పెళ్లి చేసుకుందామా..?' అని అడిగాడు. ఆమె సరేనంది. దేవేంద్ర ఊహల్లో తేలిపోయాడు. మాయలో పడిపోయాడు. 'కాస్త డబ్బు అవసరం ఉంది. ఏమీ అనుకోకూ..! సర్దగలవా..?' అని ఆమె అడిగింది. కాబోయే భార్య..! ఏమాత్రం ఆలోచించకుండా 'ఎంత కావాలి బంగారం..?' అని అడిగాడు. 'రూ.1.72 లక్షలు' అంది ఆమె. డిజిటల్ పేమెంట్ చేసేశాడు. 'నీకు నేనున్నా..' అని భరోసా ఇచ్చాడు. కానీ అనుకున్న పని అయిపోగానే ఆమె నుంచి స్పందన కరువైంది. దేవేంద్రకు విషయం అర్థమైంది. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తొలగింపు

అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చెందిన ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆ పోస్టుల నుంచీ తొలగించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కోర్టు పీపీగా హరినాథ్‌రెడ్డి, ఫస్ట్ అడిషనల్ జిల్లా కోర్టు ఏపీపీగా ఈశ్వరమ్మ పనిచేస్తున్నారు. మూడేళ్ల కాలానికి వీరిని గతంలో నియమించారు. అవినీతి ఆరోపణలు, వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న కారణాలతో పీపీ హరినాథ్‌రెడ్డి, ఏపీపీ ఈశ్వరమ్మను టెర్మినేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ రెండూ ప్రొఫెసర్లకే..!

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆత్మారావు

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షారోన్ సానియా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ ఆత్మారావు నియమితులయ్యారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ షారోన్ సానియా నియమితులయ్యారు. వీరికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో కీలకమైన ఈ రెండు పోస్టులను మెడికల్ కళాశాల ప్రొఫెసర్లకే అప్పగించారు. డాక్టర్ షారోన్ సానియా ఫార్మకాలజీ విభాగం ప్రొఫెసర్, డాక్టర్ ఆత్మారావు ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. వీరికి బాధ్యతలు అప్పగిస్తూ డీఎంఈ సత్యవెంకటలక్ష్మి నరసింహ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో ఈ రెండు పోస్టుల పట్ల ఎవరూ ఆసక్తి చూపలేదు. ఈ సమస్యపై 'ఎవరూ రారా..?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ప్రొఫెసర్లకే బాధ్యతలు ఇచ్చారు.

మహిళలకు ఆశ్రయమివ్వండి

సఖి అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సమస్యలతో వచ్చే మహిళలకు సఖి కేంద్రంలో ఆశ్రయమిచ్చి, రక్షణ కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను అదేశించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సఖి కేంద్రాన్ని (వన్‌స్టాప్) గురువారం ఆయన తనిఖీ చేశారు. పీడీ నాగమణి, జీజీహెచ్ డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, పద్మజ, అర్బన్ తహసీల్దార్ హరితో కలిసి సఖి కేంద్రం సేవలు, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. బహిరంగ, పని ప్రదేశాలు, సమాజం, కుటుంబంలో హింసకు గురైన మహిళలకు మద్దతుగా నిలిచేందుకు సఖి కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడి, గృహ హింస, అక్రమ రవాణా, గౌరవానికి సంబంధించిన నేరాలు తదితర బాధిత మహిళలకు రక్షణ కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికోసం ప్రవేశ పెట్టిన పథకాల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. గృహ హింస చట్టంకింద 1914 కేసులు నమోదయ్యాయని, వాటిలో 1290 కేసులను పరిష్కరించామని, 592 కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయని, 32 కేసులను రక్షణ అధికారి విచారిస్తున్నారని సఖి కేంద్రం మేనేజర్ శాంతావాణి కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమలో డీసీపీఓ మంజునాథ్, మహిళా ఎస్ఐ భారతి తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ సారు..!

వైసీపీ అండతో ట్రాన్స్‌కో ఏఈ వసూళ్ల పర్వం

- రూ.7.5 కోట్ల మేర అక్రమాల ఆరోపణలు
- డీడీలు తానే కడతానంటూ రైతుల నుంచి వసూలు
- ట్రాన్స్‌ఫార్మర్‌కు సైతం అదనంగా ఇచ్చుకోవాల్సిందే
- బాధితుల ఫిర్యాదులు
- కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ



పుట్లూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఓ ఏఈ అవినీతి కోట్లు దాటింది. కరెంటు శాఖలో ఆయన కరెన్సీ సారుగా మారిపోయాడు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేసినట్లు బాధితులు మండిపడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌పార్మర్, వైరు కోసం డీడీలు తానే కడతానంటూ రైతుల నుంచి డబ్బు గుంజాడంట. ట్రాన్స్‌ఫార్మర్, వైరు కావాలంటే అదనంగా ఇవ్వాలంటూ పెద్ద మొత్తంలో వసూలు చేశాడట. ఇటీవలి వరకు ఆ ఏఈ పనిచేసిన తాడిపత్రి నియోజకవర్గంలోని ఓ మండలంలో రూ.7.5 కోట్ల మేర అక్రమంగా వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకుని కూడా డీడీలు కట్టకపోవడం, ట్రాన్స్‌పార్మర్, వైరు ఇవ్వకపోవడంతో పలువురు రైతులు.. ఆ ఏఈపై ఫిర్యాదు చేశారు. విషయం తన దృష్టికి రావడంతో ప్రజాప్రతినిధి తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలుస్తోంది. ఏఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ కోరినట్లు సమాచారం. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ ఏఈ ఇటీవల శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ అయ్యారు. అయినా.. ఆయన తీరు ఏమాత్రం మారలేదన్న వాదనలు

(మిగతా 4లో...)

ప్రాణం తీసిన చీర కొంగు..!



నీలమ్మ (ఫైల్)

ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే మహిళలు చున్నీ, చీర కొంగు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే చక్రాల్లో ఇరుక్కుని ఘోర ప్రమాదాలకు కారణమౌతాయి. బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్ సమీపంలో ఇలాంటి ప్రమాదంలోనే నీలమ్మ(55) అనే మహిళ ప్రాణాలు కోల్పోయారు. లింగదహాళ్‌కు చెందిన నీలమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై గురువారం ఉద్దేహాళ్‌కు వెళ్లారు. బ్యాంకు పనులు చూసుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోకి రాగానే బైకు వెనుక చక్రంలో చీర చెంగు చిక్కుకుని ఆమె కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఉద్దేహాల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన తమ దృష్టికి రాలేదని బొమ్మనహాళ్ పోలీసులు తెలిపారు.

-ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్

తోపుదుర్తి వస్తారా..?

నేడు హెలీప్యాడ్, 'చలో పేరూరు' కేసుల్లో విచారణ

నోటీసులు ఇచ్చిన రామగిరి పోలీసులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. కుంటిమద్ది హెలీప్యాడ్ కేసు, చలో పేరూరు కేసులో విచారణకు రావాలని రామగిరి పోలీసులు ఆయనకు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ రెండు కేసుల్లో తోపుదుర్తి ప్రధాన నిందితుడు. అరెస్టు భయంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో శుక్రవారం విచారణకు హాజరయ్యేది అనుమానమేనని అంటున్నారు. చలో పేరూరు కేసులో విచారణకు ఈ నెల 14న రామగిరి సర్కిల్ కార్యాలయానికి రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. అప్పటికే అజ్ఞాతంలో ఉన్న ఆయన.. అనారోగ్యం కారణంగా విచారణకు రాలేనని తన న్యాయవాది ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఈ నెల 20వ తేదీన విచారణకు రావాలని మరోసారి నోటీసు పంపారు. దీనికి ప్రకాశ్‌రెడ్డి నుంచి స్పందన లేదని సమాచారం. కుంటిమద్ది హెలీప్యాడ్ కేసులో ప్రధాన పైలెట్ అనిల్ కుమార్‌ను విచారించిన పోలీసులు.. తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిని మరోసారి విచారించాలని నిర్ణయించారు. ఆ తరువాత చార్జిషీట్ వేయాలని భావించారు. ఈ లోగా చలో పేరూరు ఘటనలో ఆయనపై మరో కేసు నమోదైంది. రామగిరి మండలంలో అత్యాచారానికి గురైన బాలికను పరామర్శించే పేరిట తోపుదుర్తి 'చలో పేరూరు'కు పిలుపునిచ్చారు. పోలీసులు అనుమతించకపోయినా కార్యాక్రమాన్ని నిర్వహించబోయారు. దీంతో అడ్డుకున్న పోలీసులు.. ఆయనపై కేసు నమోదు చేశారు. దీంతో అరెస్టు భయంతో ఆయన హైదరాబాదుకు వెళ్లి.. అటు నుంచి ముంబైకి వెళ్లిపోయారు.



బాధితులకు సేవ చేసే అవకాశం
భవిష్యత్తుకు భరోసా
కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉద్యోగాలు
నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
జూలై 6న పరీక్ష

నర్సింగ్‌తో విదేశాల్లోనూ అవకాశాలు

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎంతోమంది విదేశాల్లో ఉద్యోగం సాధించాలని కలలు కంటుంటారు. వాటిని నిజం చేసుకోవాలంటే ఇంజనీరింగ్, కంప్యూటర్, మెడిసిన్ కోర్సులు చేసేవారు. ఆర్థిక స్థోమతలేని విద్యార్థులకు విదేశీ కలలు కల్లలుగానే మిగిలిపోయేవి. అలాంటి వారు బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తే విదేశాల్లో ఉద్యోగ కలను నెరవేర్చుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందవచ్చు. కార్పొరేట్ వైద్య సంస్థల్లో సైతం భారీ



అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల



ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. వైద్య రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో బీఎస్సీ నర్సింగ్‌కు అవకాశాలు కొదవలేవని నిపుణులు పేర్కొంటున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అందిస్తున్న నాలుగేళ్ల నర్సింగ్ బీఎస్సీ కోర్సును పూర్తి చేస్తే ఉద్యోగాలు వెతుక్కోవాల్సిన అవసరం లేదని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి.

పీహెచ్‌డీతో రీసెర్చ్...

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు పీజీ చేసి, పీహెచ్‌డీలో రీసెర్చ్ చేయవచ్చు. తద్వారా నర్సింగ్ కళాశాలల్లో ట్యూటర్, లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా బోధనావకాశాలు అందిపుచ్చుకోవచ్చు. కళాశాలల్లోనే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కార్పొరేట్ వైద్యసంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. బీఎస్సీ నర్సింగ్ అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వమే స్టైఫండ్ చెల్లిస్తుంది. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచితంగా ఆ దేశ భాష నేర్పిస్తున్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఎన్‌సెట్-2025) నిర్వహించనున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా కింద నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు శుక్రవారం వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నాలుగు సంవత్సరాల బీఎస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాలు పొందాలంటే ఇంటర్మీడియట్‌గానీ, తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. http-s://drntr. uhsap.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. జూలై 6న పరీక్షలు నిర్వహించనున్నారు. ఏపీఎన్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని ఒక ప్రభుత్వ, తొమ్మిది ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు.

5 సబ్జెక్టులు, 100 మార్కులు...



ఆన్‌లైన్ విధానంలో ఏపీఎన్‌సెట్ నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో చదివిన పాఠాలనే ప్రశ్నపత్రంగా రూపొందిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్, నర్సింగ్ ఆప్టిట్యూడ్ ఈ ఐదు సబ్జెక్టుల్లో 20 ప్రశ్నల చొప్పున మొత్తం 100 మార్కులుంటాయి. ఉమ్మడి జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

కనీస మార్కులు...

నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించాలంటే ఇంటర్మీడియట్‌లో సైన్స్ సబ్జెక్టుల్లో కనీస మార్కులు సాధించి ఉండాలి. ఐసీఎస్ఈ, ఎస్ఎస్‌సీఈ, హెచ్ఎస్‌సీఈ, ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్ తదితర బోర్డుల నుంచి ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులున్నా అర్హులే.

విదేశాల్లోనూ అవకాశాలు



నర్సింగ్ చేసిన విద్యార్థులకు విదేశాల్లోనూ అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. బీఎస్సీ నర్సింగ్‌తోపాటే జర్మన్ భాషను రాష్ట్ర ప్రభుత్వం.. విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తుంది. తద్వారా జర్మనీలో ఉద్యోగాలు పొందుతున్నారు. కళాశాల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయవచ్చు. కళాశాలలోనే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కార్పొరేట్ వైద్యసంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

-ప్రొఫెసర్ అనంతమ్మ,
ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

వైద్యసేవల్లో కీలక పాత్ర



వైద్యసేవల్లో నర్సింగ్ విభాగం కీలక పాత్రపోషిస్తుంది. బాధితులు ఆస్పత్రిలో చేరినప్పట్నుంచి డిశ్చార్జి అయ్యేవరకు అన్ని సేవలను నర్సులు అందిస్తారు. వైద్యరంగం విస్తరణలో భాగంగా ఆస్పత్రుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నర్సింగ్‌ను ఎంచుకున్న విద్యార్థులు అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ప్రాథమిక వైద్యకేంద్రాలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తోంది.

- మంగమ్మ, హెడ్‌నర్స్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

జీవితానికి భరోసా..



మా అమ్మానాన్న రైతు కూలి పనులు చేసి బీఎస్సీ నర్సింగ్ చదివించారు. స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగం లభించింది. బాధితులకు వైద్యసేవలందించడంతోపాటు వ్యక్తిగతంగా నర్సింగ్ విద్య జీవితానికి భరోసా కల్పిస్తుంది. పేద, మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ సమానమైన బీఎస్సీ నర్సింగ్‌తో ఉద్యోగ కలను సాకారం చేసుకోవచ్చు.

-అనురాధ, స్టాఫ్‌నర్స్,
ప్రభుత్వ సర్వజనాస్పత్రి



వరండాలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

వరండాలో పాఠాలు

- వైటీ చెరువు జడ్పీ హైస్కూల్‌కు గదుల కొరత
- వరండాలోనే విద్యా బోధన.. విద్యార్థుల అవస్థ
- కొత్త భవనం పూర్తి చేయాలని తల్లిదండ్రుల విన్నపం

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతో ప్రగతి సాధించామని చెబుతున్నా కొన్ని చోట్ల విద్యార్థులకు నేలబారు చదువులు తప్పడం లేదు. తరగతి గదులు లేక వరండాల్లోనే చదువుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలం లోని వైటీచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు 222మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. పాఠశాలలో 5 గదులు మాత్రమే ఉన్నాయి. అందులో మూడు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక గదిని స్టోర్‌రూంగా వినియోగించుకుంటున్నారు. మరో గదిలో ప్రధానోపాధ్యాయుడు గది, రికార్డు గది, ఇతర సామగ్రిని ఉంచడం కోసం వాడుకుంటున్నారు. ఉపాధ్యాయులకు కూర్చునేందుకు గది లేకపోవడంతో పాఠశాల తరగతి గదిలోనే ఉంటున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. నెలకొంది. మహిళా టీచర్లు, విద్యార్థినులకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. 6,7,8 తరగతులను పాఠశాల వరండాలో నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి మైదానం లేదు. వంట గది లేకపోవడంతో ఆరు బయటే వంట చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆరుబయట వంట చేస్తున్న మహిళలు

నిలిచిపోయిన పనులు

నాడు-నేడు ఫేస్-2 కింద మంజూరైన పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు నిధులు లేక నిలిచిపోయాయి. మూడేళ్ల కిందట ప్రారంభమైన భవన నిర్మాణ పనులు 80శాతం పూర్తయ్యాయి. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన పనులు అలాగే నిలిచిపోయాయి. దీంతో పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిధులు లేక నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

మెరిసేదంతా బంగారమే!

- బంగారానికి ప్రత్యామ్నాయంగా రోల్డుగోల్డు
- అందుబాటులో రకరకాల డిజైన్లు
- తక్కువ ధరలో అందమైన ఆభరణాలు
- ఆసక్తి చూపుతున్న మహిళలు

కదిరి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు బంగారం ధర సామాన్యులకు అందకుండా రేసుగుర్రంలా పరిగెడుతోంది. మరోవైపు బంగారం నగలు ఇంటిలో పెట్టుకున్నా, ధరించి బయట తిరిగినా దొంగ ల భయం. ఈ నేపథ్యంలో మహిళలు ఇటీవల కాలంలో బంగారం నగలకు ప్రత్యామ్నాంగా రోల్డుగోల్డు ఆభరణాలపై ఆసక్తి చూపుతున్నా రు. తక్కువ ఖర్చుతో కోరుకున్న డిజైన్లలో నగలు లభిస్తుండటంతో మహిళలు వీటి పట్ల మొగ్గు చూపుతున్నారు. సంపన్న వర్గాలకు చెందిన మహిళలు సైతం శుభకార్యాల్లో రోల్డుగోల్డు వస్తువులు ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అభిరుచికి తగ్గట్టుగా వందలాది డిజైన్లల్లో అందుబాటులోకి వచ్చాయి. రోల్డుగోల్డు ఆభరణాలు ధరించడం ఫ్యాషన్‌గా మారడంతో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

మ్యాచింగ్ కోసం

ఇటీవల మహిళలు, యువతుల్లో ఫ్యాషన్ పట్ల ఆసక్తి పెరిగింది. డ్రస్సుకు మ్యాచ్ అయ్యే ఆభరణాలు ధరించేవారి సంఖ్య పెరుగుతోంది. ధరించిన డ్రస్సుకు సరిపోయేలా రోల్డుగోల్డులో వివిధ రకాలు నగలు లభిస్తున్నాయి. ఈక్రమంలో వివిధరకాల రాళ్లతో(స్టోన్స్‌తో) తయారు చేసిన ఆభరణాలను చాలామంది యువతులు ఇష్టపడుతున్నారు. ఇంక ఆఫీసులకు వెళ్లేవారైతే సన్నని గొలుసుతోపాటు, బ్రాస్‌లెట్ లాంటివి ధరిస్తున్నారు. నల్లపూసల దండలు కూడా రోల్డుగోల్డులో లభిస్తుండటం తో ఎక్కువ మంది మహిళలు వాటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు.

విభిన్న మోడల్స్‌లో...

రోల్డుగోల్డులో పాపిడిబిళ్లలు, గాజులు, హారాలు, లాగ్స్ సెట్స్, చెవి దుద్దులు, వడ్డాణాలు వంటి ఆభరణాలు రకరకాల మోడల్స్‌లో లభిస్తున్నాయి. డిజైన్ బట్టి రూ.ఐదు వందల నుంచి రూ. ఆరు వేల వరకు ధరలు ఉన్నాయి.

పెళ్లిళ్లకు మరింత ప్రత్యేకంగా..

వివాహాల సమయంలో వధువు మరింత అందంగా కనిపించాలంటే ఆభరణలు ఉండాల్సిందే. తక్కువ ఖర్చుతో రోల్డుగోల్డు ఆభరణాలు కొనుగోలు చేసి, వాటిని అలంకరిస్తుంటారు. వివాహాల సమయంలో విక్రయాలు మరింత ఎక్కువగా ఉండటంతో, నిర్వాహకులు వెడ్డింగ్ కలెక్షన్ పేరుతో ప్రత్యేకంగా జ్యూవెలరీ తెప్పిస్తున్నారు. పెళ్లిళ్ల సమయంలో పెద్దహారం, చిన్నహారం, నక్లెస్‌లు, జుంకాలు కలిసి సెట్‌గా విక్రయిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనూ రకరకాల మోడల్స్

రోల్డుగోల్డు ఆభరణాల విక్రయాలు ఆన్‌లైన్‌లో జోరుగా సాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో అత్యధికంగా గోల్డు ప్లేటెడ్ బ్రాస్‌లెట్, భరతనాట్యం కెంపులు, కెంపుల్ స్టోన్ నక్లెస్, నవరత్న చైన్‌లాకెట్, గోల్డు ఫార్మింగ్ తదితర రకాలు కొనుగోలు చేస్తున్నారు. వీటికి ఆన్‌లైన్‌లో డిస్కౌంట్లు ప్రకటిస్తుండటంతో వ్యాపారాలు జోరందుకున్నాయి.



రోల్డుగోల్డు ఆభరణాలు

జాగ్రత్తలు తప్పనిసరి

ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్న రోల్డుగోల్డు ఆభరణాల విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే పెట్టిన సొమ్ము వృథా అవుతుందని పలువురు చెబుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పదేళ్లు గడిచినా పాడవకుండా ఉంటాయని వ్యాపారులంటున్నారు. వీటిని పాలిథిన్ కవర్, లేదా ప్లాస్టిక్ బాక్స్‌లో భద్రపరచాలని చెబు తున్నారు. ఆభరణాలు ధరించిన తరువాత సువాసన ద్రవ్యాలు(పర్‌ఫ్యూమ్స్) వాడకూడదని, స్నానం చేసే సమయంలో తీసి పక్కన పెట్టడం, వేడి నీటికి ఆభరణాలను దూరంగా ఉంచడం మంచిదంటున్నారు. ఉపయోగించిన తరువాత వాటిని శుభ్రం చేస్తే చాల కాలం మన్నికగా ఉంటాయని చెబుతున్నారు.

ధైర్యంగా తిరగవచ్చు: సునీత, గృహిణి, కదిరి



రోల్డుగోల్డు ఆభరణాలు ధరించి ఎక్కడైనా ధైర్యంగా తిరగవచ్చు. దొంగల బెడద ఉండదు. మహిళలకు అందాన్ని ఇవ్వడమేకాకుండా తెలికగా ఉంటాయి. ఈఆభరణాల వల్ల మహిళలు ఇబ్బందులు పడరు. బంగారు ఆభరణాలు అయితే ప్రతి క్షణం వాటిగురించే ఆలోచిస్తూ ఉండాలి.

అందంగా కనిపిస్తాం: హరిత, ఉపాధ్యాయురాలు, కదిరి



బంగారు ఆభరణాలకు తీసిపోని రీతిలో రోల్డుగోల్డు ఆభరణాలు ఉంటున్నాయి. వీటిని ధరించడం వల్ల చాలా అందంగా కూడా కనిపిస్తాము. పైగా బంగారం ధరలు ఎక్కువగా ఉండటం, రోల్డుగోల్డు వస్తువులు తక్కువకు దొరుకుతుండటంతో చాలా మంది వీటికి ఆకర్షితులవుతున్నారు. రకరకాల డిజైన్లలో ఆభరణాలు లభిస్తుండటంతో ప్రాధాన్యం ఇస్తున్నాం.

మహిళల ఆసక్తి పెరిగింది: రవీంద్రారెడ్డి, వ్యాపారి, కదిరి



ఇటీవల రోల్డుగోల్డు ఆభరణాలపై మహిళలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణ మహిళ నుంచి సంపన్న వర్గాలు, ఉద్యోగుల వరకు ఈఆభరణాలను ఎంచుకుంటున్నారు. మహిళల అభిరుచుల మేరకు అన్నిరకాల డిజైన్లు అందుబాటులో ఉంచుతున్నాం.

కరెన్సీ సారు..!

(3వ పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకొని నకిలీ బిల్లులు సృష్టించి లక్షలాది రూపాయలు ఆర్జించాడన్న ఆరోపణలు సైతం ఆ అధికారిపై వినిపిస్తున్నాయి.

లక్షలు ముట్టజెప్పాల్సిందే..

రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ ఏఈ నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. రైతులు కట్టే డీడీల కన్నా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నాడన్న విమర్శలున్నాయి. ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. రైతులతో నేరుగా డీడీలు కట్టించుకోకుండా తనకే నగదు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడని తెలుస్తోంది. ఇలా ఏళ్ల తరబడి అక్కడే ఉండి లక్షలాది రూపాయలు ఆర్జించాడన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 458 మంది రైతుల నుంచి వసూలు చేశాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారం చేపట్టాక ఆ అధికారి ఆటలు సాగలేదు. సాధారణ బదిలీల్లో భాగంగా శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆ మండలంలో కూడా ఆయన తీరులో మార్పు లేదని తెలుస్తోంది.

డీడీలు తానే తీస్తానంటూ..

సాధారణంగా రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అందుకయ్యే ఖర్చును విద్యుత్ అధికారులు అంచనా వేసి, చెబుతారు. అంత మొత్తానికి బ్యాంకులో డీడీ తీసి, ఏఈకి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ అధికారి మాత్రం నగదు తనకే ఇవ్వాలనీ, తానే డీడీ తీస్తానంటూ రైతులను డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రైతులే నేరుగా డీడీలు చెల్లిస్తే ఎంత హార్స్ పవర్‌కు ఎంత అమౌంట్ చెల్లించామనేది తెలుస్తుంది. రైతుల నుంచి అధికంగా వసూలు చేసి, ఆయన డీడీలు తీసేవాడట. ఇలా రైతుల నుంచి అంచనాల కంటే అధికంగా డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విస్తుపోయిన ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వంలో రైతుల నుంచి అడ్డగోలుగా వసూలుచేసిన ఆ అధికారి గురించి తెలుసుకున్న ప్రజాప్రతినిధి విస్తుపోయారని తెలుస్తోంది. రూ.7.50 కోట్ల మేర అవకతవకలకు పాల్పడినట్లు ప్రజాప్రతినిధి దృష్టికి రావడంతో తక్షణమే ఆ అధికారిపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను కోరినట్లు సమాచారం. ఇలాంటి అధికారి తమకు వద్దంటూ బదిలీ చేయించినట్లు తెలుస్తోంది.

నానాటికీ తీసికట్టు

(3వ పేజీ తరువాయి)

విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు లేకపోవడంతో కొన్ని పాఠశాలలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని కాశేపల్లి గ్రామంలో దాదాపు 50మంది విద్యార్థులను గుత్తి, మిడుతూరు గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. కాశేపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఒక విద్యార్థిని మాత్రమే వెళుతోంది. ఆమెకు ఒక ఉపాధ్యాయురాలు విద్యాబోధన చేస్తున్నారు. యాజమాన్యాల ప్రచార మాయలో పడి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం: రాముడు, ఎంఈఓ



ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే మౌలిక సదుపాయలు, నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. మరింత విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటాం. ఇక కాశేపల్లి గ్రామంలో పిల్లలను బడికి పంపమని గత ఏడాది ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులను అడిగితే వారు నిరాకరించారు. ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా కూడా తెలియజేశారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో

జీఎం తనిఖీలు

గుంతకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అరుణ్ కుమార్ జైన్ గురువారం సాయంత్రం స్థానిక రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఉదయం రైల్వే డివిజన్‌లోని తిరుపతి, రేణిగుంట స్టేషన్లను, అభివృద్ధి పనులను పరిశీలించిన జీఎం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక రైలులో రీర్ విండో ద్వారా రేణిగుంట-గుంతకల్లు మధ్యన ఉన్న రైల్ ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. సాయంత్రం నాలుగున్నరకు గుంతకల్లుకు చేరిన జీఎం స్థానిక డీజిల్ షెడ్‌ను సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మించిన సోలార్ పవర్ వ్యవస్థను ప్రారంభించారు. యాగ్జిలరీ సర్వీస్ భవనాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లగా.. నెలాఖరున జీఎం ఉద్యోగ విరమణ ఉండటంతో ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయనను సన్మానించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులతో జీఎం సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

రెచ్చగొట్టేలా జగన్ మాటలు

- తల్లి, చెల్లిని గెంటేసి, ఇప్పుడు మహిళలపై సానుభూతి
- 70 శాతం రెడ్లకు పదవులిచ్చి, కమ్మవాళ్లపై ఇప్పుడా ప్రేమ?
- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో రెట్టింపు సంక్షేమం అమలవుతూ ఉంటే తట్టుకోలేని జగన్ తన సైకో బ్యాచ్‌తో రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. అనంతపురం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించేలా జగన్ వ్యవహరిస్తున్నాడన్నారు. 80 కిలోమీటర్లు ర్యాలీగా వెళ్లవద్దంటూ పోలీసులు చెప్పినా ఆయన పట్టించుకోలేదన్నారు. సభ నిర్వహించరాదన్నా ముందుకెళ్లి ఇద్దరి చావుకు కారణమయ్యాడంటూ విమర్శించారు. బెట్టింగ్‌లు ఆడి నాగమల్లేశ్వర్‌రావు ఏడాది కిందట మరణిస్తే.. ఇప్పుడు గుర్తుకు రావడం రాజకీయ డ్రామా అన్నారు. జగన్ కోసం వచ్చిన ఇద్దరు చనిపోతే...ఒక్క నిమిషం వాళ్ల కుటుంబీకులకు మాట్లాడించలేదన్నారు. జగన్ ఏపీలో కమల్‌హాసన్ లాగా బాగా నటిస్తున్నాడని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు, దళితులపై దాడులు, మహిళల హత్యల్లో అప్పటి జగన్ ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదన్నారు. కానీ అవన్నీ మరిచి నేడు మాట్లాడుతున్నారన్నారు. తల్లి విజయమ్మను పార్టీ నుంచి, షర్మిలను ఇంటి నుంచి గెంటేసిన ఆయన, అమరావతి మహిళలపై తన మీడియాలో వేశ్యలుగా మాట్లాడించిన జగన్ ఇప్పుడు మహిళల గౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గంజాయి తాగేటోళ్లు, రేపిస్టులు, భూకబ్జా కేసుల్లో ఉన్న వాళ్లను జగన్ పరామర్శించడానికి వెళ్లడాన్ని బట్టే జగన్ మనస్తత్వం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. మీరు నరికితే నరికించుకుంటారా..? అవతలి వాళ్లకు చేతులు ఉండవా... వేట కొటవళ్లు ఉండవా అని ప్రశ్నించారు. 2029లో అధికారంలోకి వస్తే అంటూ రెచ్చగొడితే ప్రజలు అధికారం కట్టబెట్టరని, మీ మాటలకు ప్రజల దగ్గర సమాధానం ఉందంటూ సూచించారు. ఇద్దరు పిల్లలుంటే అమ్మఒడి రూ. 30 వేలు ఇస్తామని చెప్పి, అర్ధ ఒడిగా చేశారన్నారు. తన ప్రభుత్వంలో 70 శాతం పదవులు తన సామాజికవర్గం వాళ్లకు ఇచ్చి, ఇప్పుడు కమ్మ వాళ్లపై ప్రేమ చూపడం హాస్యాస్పదమన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో వందకు వంద శాతం రెట్టింపు సంక్షేమం అమలవుతోందన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీ కొని వ్యక్తి మృతి


సయ్యద్‌ఖాసీం(ఫైల్)

గుత్తి, జూన్19(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో లారీ ఢీకొని సయ్యద్ ఖాసీం(55) గురువారం మృతి చెందాడు. తుగ్గలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన పెద్దులు, సయ్యద్ ఖాసీం ఇద్దరూ స్కూటీపై పట్టణంలో ఓ వివాహ కార్యక్రమానికి బయల్దేరారు. గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు వద్ద స్కూటీని రోడ్డు పక్కన ఆపు తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈప్రమాదంలో సయ్యద్ ఖాసీం లారీ వెనుక టైరు కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్దులు స్వల్పంగా గాయపడ్డాడు. సీఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చిన్నముష్టూరు వద్ద గుర్తు తెలియని వ్యక్తి...

ఉరవకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని 55 నుంచి 60 సంవత్సరాలు గల ఓ వ్యక్తి మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో వ్యక్తిని గుర్తించలేని పరిస్థితి ఉంది. మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహంపై నీలిరంగు చొక్కా, నీలి రంగు ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వీఆర్ఏ ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలూరు రోడ్డులో నివాసముంటున్న కర్నూలు జిల్లా తుగ్గలి వీఆర్‌ఏ రామాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. రామాంజనేయులు భార్య సులోచన 15 రోజుల కిందట మరణించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటికి తాళం వేసి పట్టణంలోని ఆరోగ్య మాత పుణ్యక్షేత్రంలో నిద్ర చేయడానికి వీఆర్‌ఏ వెళ్లాడు. దీన్ని గమనించిన దుండగులు రాత్రి అతడి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 15 తులాల బంగారు నగలు, రూ. 1.3 లక్షలు చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన వీఆర్‌ఏ చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుడి చీనీ చెట్లు ధ్వంసం


ధ్వంసం చేసిన చీనీచెట్లు

పుట్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు నారాయణరెడ్డికి చెందిన రెండేళ్ల వయస్సు ఉన్న చీనీచెట్లను గురువారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మూడు ఎకరాల్లో 350 చీనీ చెట్లను సాగు చేస్తుండగా వాటిలో 25 చెట్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఉదయం తోటకు వెళ్లిన నారాయణరెడ్డి ధ్వంసమైన చీనీచెట్లను గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని సీఐ సత్యబాబు పరిశీలించి డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సుదర్శన్‌నాయుడు, రామాంజనేయులు, సుబ్బారెడ్డి, రవీంద్రచౌదరి, దస్తగిరి, పెద్దిరాజు రైతును పరామర్శించారు.

చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో

- పురుగుల మందు తాగిన టిప్పర్ డ్రైవర్
- యజమాని కుమారుడి తీరుతో మనస్తాపం చెందినట్లు ఆవేదన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఇద్దరిపై కేసు నమోదు


ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వీడియో పెట్టిన హుస్సేన్

యాడికి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తాను గతంలో పనిచేసిన టిప్పర్ యజమాని కొడుకు డబ్బు విషయంలో కొట్టి అవమానించాడనీ, దీంతో చనిపోతున్నానంటూ మండలంలోని చందన గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ హుస్సేన్ విషద్రావకం తాగాడు. దానిని సెల్ఫీ వీడియో తీశాడు. విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హుస్సేన్ సోషల్ మీడియాలో పెట్టిన వీడియో మేరకు వివరాలిలా ఉన్నాయి. హుస్సేన్ గతంలో రాయలచెరువుకు చెందిన పారిశ్రామికవేత్త టిప్పర్‌కు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో అడ్వాన్సుగా యజమాని నుంచి రూ.30వేలు తీసుకున్నాడు. ఇటీవల అతడి వద్ద పని మానేసి, మరొకరి వద్ద డ్రైవర్‌గా చేరాడు. విషయం తెలుసుకున్న పాత యజమాని కుమారుడు ఈనెల 18న రాయలచెరువులో ఉన్న హుస్సేన్ వద్దకెళ్లి ఇంటివద్దకు రావాలనీ, మాట్లాడాలని చెప్పినట్లు తెలిపాడు. ఇదే క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి యజమాని కొడుకు.. హుస్సేన్‌ను కొట్టినట్లు వాపోయాడు. యజమాని ఇచ్చిన రూ.30వేలు తిరిగి ఇచ్చినా.. ఇవ్వలేదనడం బాధేసిందని వీడియోలో ఆవేదన చెందాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు తెలిపాడు. విషద్రావకం తాగి స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో వారు హుస్సేన్‌ను రాయలచెరువు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుత్తికి తీసుకెళ్లారు. హుస్సేన్ తాను చనిపోతున్నానంటూ తీసుకున్న సెల్ఫీవీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. హుస్సేన్ ఆత్మహత్యాయత్నానికి సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీఆర్వోకు స్పెషల్ గ్రేడ్ ప్రమోషన్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)మలోలకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఇదివరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయనకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా లభించింది. దీంతో ఆయన్ను గురువారం అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

- ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం


రేవంత్‌రెడ్డి, భరత్ వంశీకృష్ణ, అర్జున్ టెండూల్కర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 61బంతుల్లో 10బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు అరీఫ్ బాషా 3, ధృవకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ రేవంత్‌రెడ్డి 86పరుగులు, ఫర్హాద్ ఖాద్రి 56 పరుగులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ అవసరం

- కేంద్ర కమిటీ సభ్యులకు ఇరిగేషన్ అధికారుల నివేదన
- పీఏబీఆర్‌ను పరిశీలించిన కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ
- జిల్లాలో పలు ప్రాంతాల్లో వాటర్‌షెడ్, ఉపాధి పనుల పరిశీలన
- క్షేత్రస్థాయిలో రైతులతో మాటామంతీ

కూడేరు/కళ్యాణదుర్గం/అనంతపురం అర్బన్/యల్లనూరు/రాయదుర్గం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో 11.1 టీఎంసీల నీరు నిల్వ చేయడానికి భూ సేకరణ అవసరమని కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులకు స్థానిక ఇరిగేషన్ అధికారులు నివేదించారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంను కేంద్ర కమిటీ సభ్యులు గౌతమ్, శంకర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఏబీఆర్ డ్యాం గురించి అధికారులతో ఆరా తీశారు. ప్రస్తుతం డ్యాంలో 2.300 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ప్రతి ఏడాది 5 టీఎంసీల వరకు తీసుకొని, కుడికాలువకు కింద ఉన్న చెరువులకు అందిస్తామన్నారు. ఈ డ్యాం ద్వారా జలవిద్యుత్ ఉత్పత్తితోపాటు, నాలుగు ప్రాజెక్టులకు నీటిని సరఫరా చేస్తున్నట్లల వివరించారు. అయితే 11.1 టీఎంసీల నీల్వ సామర్థ్యంతో డ్యాంను నిర్మించారని, అందుకు అవసరమైన భూ సేకరణ జరగాల్సి ఉందని డ్యాం ఈఈ శశిరేఖ వివరించారు. డ్యాంకు అక్కడక్కడ లీకేజీలు ఉన్నాయని, నిధులు కేటాయిస్తే త్వరగా పనులు చేయవచ్చన్నారు. డ్యాంలో పూర్తి స్థాయి నీరు నిల్వ చేస్తే కుడికాలువ కిందనున్న 49 చెరువులకు నీరు అందించి, 40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. వీటన్నింటి కోసం రూ.550 కోట్ల నిధులు అవసరమని తెలియజేశారు. కాగా కేంద్ర బృందం సభ్యులు ముందుగా కూడేరులోని సబ్ స్టేషన్ ఆవరణలోని పీజోమీటర్ ద్వారా భూగర్భజల మట్టాన్ని పరిశీలించారు. అనంతరం పీఏబీఆర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డ్వామా వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి, డీఈలు వెంకటరమణ, ఉదయశేషయ్య, ఏఈలు రామకృష్ణ, ముత్యాలప్ప, లక్ష్మీనరసింహశాస్త్రి, వెంకటరమణ, గంగమ్మ, లక్ష్మీదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

కళ్యాణదుర్గం మండలంలోని గోళ్ల పంచాయతీ పరిధిలో జరిగిన మైక్రో వాటర్ షెడ్ పనులను కేంద్ర బృందం సభ్యులు శంకర్, గౌతమ్ గురువారం పరిశీలించారు. రాతి చప్టాళ్లు, ఫాంపాండ్లు, ఊటకుంట పనులను పరిశీలించారు. వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇంకా ఏయే పనులు చేస్తున్నారని అధికారులతో అడిగి తెలుసుకున్నారు. తర్వాత అక్కడి నుంచి రాయదుర్గం మండలం వీరాపురంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రెంచ్ పనులు, మొక్కల పెంపకాన్ని బృందం సభ్యులు పరిశీలించారు.


పీఏబీఆర్ డ్యాంను పరిశీలించిన కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులు


కళ్యాణదుర్గం మండలం గోళ్లలో రాతికట్టడాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

యల్లనూరు మండలంలో ఉపాధి పనులు...

యల్లనూరు మండలంలో ఉపాధి పథకం ద్వారా జరిగిన పనులను కేంద్రబృందం గురువారం పరిశీలించింది. చింతకాయమంద, మల్లాగుండ్ల పంచాయతీల్లో సుమారు రూ.ఏడు కోట్లతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. అనంతరం గడ్డంవారిపల్లి పంచాయతీలో ఉపాధి పనుల ద్వారా నిర్మించిన మట్టిరోడ్డు, నీటితొట్లను పరిశీలించారు. వారి వెంట ఉపాధిపథకం సెంట్రల్ పీఓ నభనీస్‌దాస్, నాబార్డ్ కన్సల్టేషన్ అధికారి వెంకటేశ్వరన్, జిల్లా డ్వామా అధికారు, ఉపాధి పథకం కమిషనర్ శివప్రసాద్, పీడీ సలాం, ఏపీడీ పుల్లారెడ్డి ఉన్నారు.

నీటితొట్టెలు ఉపయోగపడుతున్నాయా..?

జిల్లాలో ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన పశువుల నీటితొట్టెలు ఉపయోగపడుతున్నాయా ? అని యల్లనూరు మండలం తిమ్మంపల్లి రైతులను కేంద్ర కమిటీ బృందం సభ్యులు నవనీతదాస్, వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. డ్వామా పీడీ సలీం బాషాతో కలిసి ఉపాధి నిధులతో చేపట్టిన పలు రకాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనుల వివరాలను డ్వామా పీడీ సలీం బాషా బృందం సభ్యులకు వివరించారు. తిమ్మంపల్లిలో పశువుల నీటి తొట్టెలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తర్వాత తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లిలో అటవీ శాఖ నర్సరీని పరిశీలించారు.

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి 25న పరీక్ష

అనంతపురంవిద్య, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతివరకు మిగిలిన సీట్లకు ఈనెల25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతపురం జిల్లాలో సీట్లు ఖాళీ లేవన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కాళసముద్రం బీసీ-1, మలుగూరు ఎస్సీ గ్రూపు 3లో 02, నల్లమాడలో ఎస్సీగ్రూపు-3లో 2, ఎస్టీ2, ఓసీ1, అమరాపురంలో ఎస్సీగ్రూపు-3లో 1, రొళ్లలో ఎస్సీగ్రూపు3-లో 2, ఓసీ 1 చొప్పున ఆరో తరగతిలో సీట్లు ఉన్నాయన్నారు. మలుగూరులో ఎస్సీ గ్రూపు-3లో 1, అమరాపురంలో ఎస్సీ గ్రూపు-3లో 1, హిందూపురం బాలికలలో ఎస్సీ గ్రూపు-3లో 3, ఎస్టీ 1, బీసీ 1, రొళ్ల ఎస్టీ 1 చొప్పున ఏడో తరగతిలో సీట్లు ఉన్నాయన్నారు. తొమ్మిదో తరగతిలో హిందూపురం బాలికలలో ఎస్సీ గ్రూపు-3లో ఒకటి ఖాళీ ఉందన్నారు. 8వ తరగతిలో ఎక్కడా సీట్లు ఖాళీలు లేవని అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు.

వైద్యశాఖలో బదిలీల గోల

(3వ పేజీ తరువాయి)

తలెత్తుతున్నాయి. మినహాంపులు వర్తించేవారిలో అత్యధికంగా స్టాఫ్ నర్సులు ఉన్నారు. జోన్ పరిధిలో 163 మంది స్టాఫ్ నర్సులు ఉండగా.. అనంతపురం నుంచి కర్నూలు, కర్నూలు నుంచి అనంతపురం వచ్చేందుకు ఎక్కువగా పోటీ పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి కౌన్సెలింగ్ జరుగుతోంది. ఎప్పటికి పూర్తవుతుందో అధికారులు చెప్పలేకున్నారని స్టాఫ్‌నర్సులు అంటున్నారు.

బదిలీ ఉత్తర్వుల జారీ

ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ), ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్), సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్(ఎస్ఎస్‌హెచ్), ప్రాథమిక వైద్య కేంద్రాలలో(పీహెచ్‌సీ) పనిచేస్తున్న జోనల్ కేడర్ల ఉద్యోగుల బదిలీల ప్రక్రియను రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య కొనసాగిస్తున్నారు. కార్యాలయాల సూపరింటెండెంట్, ఫార్మసీ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్, రేడియోగ్రాఫర్, డీపీఎంఓ, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, పీఎంఓఓ, హెడ్‌నర్స్ కేడర్లలో ఐదు సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన వారిని బదిలీచేశారు. కొన్ని మినహాయింపుల కింద అదేస్థానంలో కొనసాగేలా నిలుపుదల చేశారు. రేడియోగ్రాఫర్ కేడర్‌లో జీజీహెచ్‌లోని సాలివన్ సింగ్‌ను ఇక్కడే ఉంచారు. తిరుపతి నుంచి జీఎంసీకి సరేంద్ర బదిలీ అయ్యారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా(డీపీఎంఓ) యర్రగుంట్ల నుంచి బెళుగుప్ప పీహెచ్‌సీకి నీలకంఠ, కొడికొండ నుంచి అనంతపురం అర్బన్‌కు తిప్పేస్వామి, కర్నూలు జిల్లా పగిడిరాయి నుంచి కొనకొండ్లకు మరియాదాస్‌ను బదిలీ చేస్తూ ఉత్తరులుఉ ఇచ్చారు. అనంతపురం జీజీహెచ్‌లో పనిచేస్తున్న సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ సోమశేఖర్‌ను కర్నూలు జీజీహెచ్‌కు, నర్స్ ఆఫ్ హెచ్‌ఈ కేడర్ నిర్మలాబాయిని నంద్యాల నుంచి అనంతపురం జీజీహెచ్‌కు బదిలీచేశారు. వీరితోపాటు ఆరుగురు కార్యాలయాల సూపరింటెండెంట్‌లు, 14మంది ఫార్మసీ ఆఫీసర్లు, ఐదుగురు చొప్పున హెల్త్ ఎడ్యుకేటర్లు, పారామెడికల్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న 19మంది హెడ్ నర్సులు కూడా బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో 56 మందికి గురువారం ఆర్డీ బదిలీ ఉత్తర్వులు జారీచేశారు.

ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కార్యాలయాల సూపరింటెండెంట్ క్యాడర్ బదిలీలు.		
శ్రీనివాసకుమార్	డీఎంహెచ్ఓ ఆఫీస్	వైద్యకళాశాల, కర్నూలు
రమణ	జీజీహెచ్	దంత వైద్య కళాశాల, కడప
హరిశకంర్‌రావ్	వైద్య కళాశాల	వైద్యకళాశాల, కర్నూలు
షర్మిల	వైద్య కళాశాల	రిటెన్షన్
శ్రీలత	డీఎంహెచ్ఓ ఆఫీస్	రిటెన్షన్
విజయభాస్కర్‌రెడ్డి	డీఎంహెచ్ఓ ఆఫీస్	మలేరియా ఆఫీసర్, కడప
ఫార్మసీ ఆఫీసర్ క్యాడర్ బదిలీలు.....		
వేణుగోపాల్	యూనిట్ హాస్పిటల్	ఆత్మకూరు
మాధవ	ముద్దినాయనపల్లి	పీటీసీ యూనిట్ హాస్పిటల్
సురేంద్రనాథ్	కల్లూరు	కన్నూరు, కడప
నాగవేణి	పుట్టపర్తి	వెంగలమ్మచెరువు
జయలక్ష్మి	ఎద్దులపల్లి	క్రిష్ణపాడు
స్వర్ణకుమారి	పట్నం	రెడ్డిపల్లి
శంకర్‌నాయక్	వెంగలమ్మచెరువు	పుట్టపర్తి
ఓబులేసు	తొండూరు, కడప జిల్లా	బుక్కపట్నం
కేఎండీ ఇంతేఖాన్	బుక్కపట్నం	ఎద్దులపల్లి
సునీల్‌కుమార్	క్రిష్ణపాడు	నల్లచెరువు
జయప్రకాస్	రెడ్డిపల్లి	నల్లచెరువు
అనురాధ	యర్రగుంట్ల	ముడిపాపనపల్లి, చిత్తూరుజిల్లా
చిన్నయ్యశెటి	నల్లచెరువు	పట్నం
రామచంద్రనాయక్	నాగసముద్రం	వజ్రకరూరు
హెల్త్ ఎడ్యుకేటర్ కేడర్ బదిలీలు....		
లక్ష్మీనారాయణ	డి.హీరేహాళ్	ఆఫీస్ బేరర్
సుబ్రమణ్యం	పెద్దపప్పూరు	పెద్దపప్పూరు (రిటెన్షన్)
రుక్మిణి	మల్లనూర్, చిత్తూరు జిల్లా	శ్రీధరఘట్ట
విజయభాస్కర్	క్రిష్ణపాడు	క్రిష్ణపాడు (రిటెన్షన్)
పాతిమున్నీసాబీ	వైద్యకళాశాల	వైద్యకళాశాల (రి)

పారామెడికల్ ఆఫీసర్ కేడర్ బదిలీలు		
ఉరుకుందప్ప	తాడిమర్రి	ఆఫీస్ బేరర్ (రిటెన్షన్)
శ్రీనివాసులు	పెనుకొండ	ఆఫీస్ బేరర్ (రిటెన్షన్)
హుస్సేన్	యర్రగుంట్ల	తరిమెల
రామమోహన్‌రెడ్డి	బుక్కపట్నం	రిటెన్షన్
హరిప్రసాద్	ఐరాల	తిమ్మంపల్లి
హెడ్ నర్స్ కేడర్ బదిలీలు....		
భానులత	అనంతపురం	ఆఫీస్ బేరర్ (రిటెన్షన్)
మహాలక్ష్మి	అనంతపురం	ఆర్‌హెచ్‌సీ, ఆత్మకూరు
మరియమ్మ	అనంతపురం	ఎస్ఎస్ఎస్‌హెచ్, కడప
సుభాషిణి	కర్నూలు	అనంతపురం
ఆశాలత	అనంతపురం	రిటెన్షన్
జరీనా పర్వీన్	అనంతపురం	కర్నూలు
సుగుణావతమ్మ	కర్నూలు	అనంతపురం
ఉమాదేవి	కర్నూలు	అనంతపురం
నిర్మల	అనంతపురం	కర్నూలు
పద్మజ	అనంతపురం	కర్నూలు
శాంత	అనంతపురం	తిరుపతి
జమీలాబీ	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
దుర్గాంబ	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
నిర్మలా కుమారి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
ఆదిలక్ష్మి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
బాలతులసమ్మ	అనంతపురం	రిటెన్షన్
వనజ	అనంతపురం	రిటెన్షన్
జ్యోతి రోజామణి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప
ఉమాదేవి	అనంతపురం	ఎస్ఎస్‌హెచ్, కడప

ఇక ఎంటీఎస్ టీచర్ల వంతు

- మిగిలిన ఖాళీలకే సర్దుబాటు
- నిబంధనలపై పలువురి ఆవేదన

అనంతపురం విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ టీచర్ల బదిలీలు ముగియడంతో ఇక మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉద్యోగుల వంతు మొదలైంది. ఇపుడు ఎంటీఎస్ టీచర్లను ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు సర్దుబాటు చేయడానికి నిర్ణయం తీసుకు న్నారు. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జిల్లాలో ఎంటీఎస్ టీచర్ల బదిలీల సర్దుబాటుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. జిల్లాలో 590మంది వరకు ఎంటీఎస్ టీచర్లు ఉన్నారు. ఇందులో డీఎస్సీ-2008 వారు 180మంది ఉండగా, డీఎస్సీ-1998 వారు 414మంది ఉన్నారు. వీరందరిని సర్దుబాటు చేయనున్నారు.

దూరంగా ఉన్న మండలాలకే..?

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటుకు రాష్ట్ర కమిషనర్ నిబంధనలు విడుదల చేశారు. ఇందులో తొలుత ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలకు వీరిని కేటాయించాలి. ఆతర్వాత ఒక్క టీచర్ ఉన్న పాఠశాలకు పంపించాలి. అనంతరం నిబంధనల మేరకు ఉండాల్సిన టీచర్లకంటే తక్కువ టీచర్లు ఉన్న స్కూళ్లకు ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇటీవల రెగ్యులర్ టీచర్ల బదిలీలు జరిగాయి. నగర, పట్టణ, మండల సమీపంలో ఉన్న అన్ని పాఠశాలలకు టీచర్లు వచ్చేశారు. ఈపరిస్థితులలో ఉమ్మడి జిల్లాలోని దూర ప్రాంతాలలోని పాఠశాలల్లోనే టీచర్ల పోస్టులు అధికంగా ఖాళీగా కనిపిస్తున్నాయి. నిబంధనల మేరకు ఎంటీఎస్ టీచర్లు 75శాతం మంది మారుమూల ప్రాంతాల పాఠశాలలకే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎంటీఎస్ టీచర్లు తీవ్ర ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు వచ్చాయి: ప్రసాద్‌బాబు, డీఈఓ

ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. శుక్రవారమే కౌన్సెలింగ్ నిర్వహించాలనికూడా చెప్పారు. ఇప్పటికే ఎంటీఎస్ టీచర్ల సీనియారిటీ జాబితాను ఇచ్చాం. అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే సవరిస్తాం, ఆతర్వాతనే కమిషనర్ ఇచ్చిన నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటులో పోస్టింగ్‌లు ఇస్తాం.

కోర్టు వాయిదాకు టీడీపీ నేతల హాజరు

అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కక్ష సాధింపుతో అక్రమంగా పెట్టిన కేసులో కోర్టు వాయిదాకు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. 2023లో నారా భువనేశ్వరిపై వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు అనంతపురంలోని రవి పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం.. వారిపై అక్రమ కేసులు బనాయించింది. ఆ కేసుకు సంబంధించి కోర్టు వాయిదాకు గురువారం విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శ్రీధర్ చౌదరి, ఆదినారాయణ మరో 20 మంది వరకూ హాజరయ్యారు. విచారణను కోర్టు ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది. కార్యక్రమంలో న్యాయవాదులు గాజుల ఆదెన్న, తిరుమల నాయడు, లేపాక్షినాయుడు, బుడేన్ సాబ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు క్లర్క్ మృతి

శెట్టూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిగొల్లపల్లి సమీపాన బైక్‌లు ఢీకొని ములకలేడు యూనియన్ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న క్లర్క్ పార్థసారథి (53) దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లికి చెందిన పార్థసారథి ములకలేడులో పనిచేస్తుండేవారు. కళ్యాణదుర్గంలో నివాసముండేవారు. గురువారం విధులకు హాజరయ్యేందుకు కళ్యాణదుర్గం నుంచి ములకలేడుకు బయల్దేరారు. అడవిగొల్లపల్లి సమీపాన గాలిమర వద్ద శెట్టూరు మండలం కనుకూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ తన కూతురిని పాఠశాలకు వదిలేందుకు కళ్యాణదుర్గం వైపు వెళ్తూ ఢీకొట్టారు. దీంతో పార్థసారథి అక్కడికక్కడే మరణించాడు. సత్యనారాయణకు గాయాలవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. పార్థసారథికి భార్య నాగలక్ష్మి, కుమార్తె శివగంగ ఉన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- రేపట్నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 25 నుంచి ఆన్‌లైన్‌లో కళాశాలల ఎంపిక

అనంతపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభంకానుంది. గురువారం అందుకు సంబంధించిన వివరాలను అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి వెల్లడించారు. శుక్రవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు రూ. 250 చెల్లించాల్సి ఉం టుందన్నారు. 21 నుంచి 28వ తేదీ వరకు ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థులు సమీప కళాశాలల్లో కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చన్నారు. జూన్ 25 నుంచి 30వతేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ చేపడతామన్నారు. జూలై 4 నుంచి సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. స్పోర్ట్స్ కేటగిరీ విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. 25 నుంచి 28వ తేదీ వరకు ఎన్‌సీసీ, పీడబ్ల్యూడీ, స్పోర్ట్స్, సీఏపీ, స్కౌట్స్ గైడ్స్, తదితర విద్యార్థులు కేటాయించిన కౌన్సెలింగ్ తేదీల్లో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ నంబరు 63055 10654, కళ్యాణదుర్గం 9505504207, తాడిపత్రి 7901620198, హిందూపురం 8297525703 నంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ వివరించారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలు ఇవీ..

తేదీ	ర్యాంకు నుంచి..	ర్యాంకు వరకు..
21	1	15,000
22	15,001	32,000
23	32,001	50,000
24	50,001	68,000
25	68,001	86,000
26	86,001	1,04,000
27	1,04,001	1,20,000
28	1,20,001	చివరి ర్యాంకు వరకు..


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయ చంద్రారెడ్డి

యోగాతో ఒత్తిడి దూరం: జేసీ


ఎస్కేడీ నగరపాలక ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

అనంతపురంవిద్య, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాసనాలు నిత్యం చేయడం వల్ల మానసిక ఒత్తిడి దూరమై ఆరోగ్యంగా ఉంటారని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్లో ఉన్న ఎస్కేడీ నగరపాలక ఉన్నతపాఠశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేసీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉదయం 45 నిమిషాలు యోగాసనాలు వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగాతో ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. తర్వాత యోగా గురువు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలకేంద్రంతో పాటు కల్లూరు, పెనకచెర్ల గ్రామాల్లో మండల స్థాయి అధికారులు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గార్లదిన్నెలో ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ దామోదరమ్మ, ఇతర అధికారులు ఉన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

అనంతపురం క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారం అందడంతో టూ టౌన్ పోలీసులు గురువారం దాడులు చేశారు. సీఐ శ్రీకాంత్ యాదవ్, ఇతర సిబ్బంది దాడులు చేసి నిర్వాహకురాలు లక్ష్మీపై కేసు నమోదు చేశారు.

మట్కా బీటర్‌పై కేసు నమోదు

అనంతపురం క్రైం: నగరంలోని ఒకటో రోడ్డుకు చెందిన ఓ మట్కా బీటర్‌పై త్రీ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. రెండో రోడ్డులోని ఓ చిల్లర కొట్టులో పనిచేసే ఇతను మట్కా చిట్టీలు రాస్తున్నాడన్న సమాచారం రావడంతో వెళ్లి అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సీఐ శాంతిలాల్ తెలిపారు. అలాగే అతడి నుంచి రూ. 12120 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

కనగానపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో నిరుపేదలకు, విభిన్న ప్రతిభావంతులకు అనేక సేవలందిస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాలిస్సిన బాధ్యత అందరిపై ఉందని ఆ సంస్థ సభ్యులు నరసింహమూర్తి, ప్రభాకర్, నాగరాజు పిలుపునిచ్చారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో గురువారం వారు విభిన్న ప్రతిభావంతులతో కలిసి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అంతకుమునుపు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఈనెల 20వతేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, మేయర్, నగరపాలక సంస్థ కమిషనర్‌లకు ఇప్పటికే సమ్మె నోటీసు అందజేశామని చెప్పారు. శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్తామని నగరంలో తాగునీటి, విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే ప్రజలు పెద్దమనసుతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నారాయణస్వామి, నూర్ బాషా, పుల్లయ్య, మురళీ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.29వేలు

అనంతపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.29,100లకు అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.3వేలు, సరాసరి రూ.17,800తో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 506టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆవుల చక్రధర్ యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో గురువారం ఏపీ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర రావు, ఇన్‌చార్జి నూకాలమ్మ సమక్షంలో అనంతపురం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఆవుల చక్రధర్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 50శాతానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాములు యాదవ్‌ను ఎన్నుకున్నారు.

అనంతను సుందర నగరంగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే


అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసి అనంత నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన కమిషనర్ బాలస్వామితో కలిసి అధికారులతో సమీక్షించారు. నగరంలో మున్సిపల్ స్థలాల కబ్జాలు, ఆక్రమణలపై సీరియస్‌గా పరిగణించాలని ఆదేశించారు. ఆక్రమణ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయాలన్నారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ఇంకా ఎక్కడెక్కడ అవసరం ఉందో అడిగి తెలుసుకున్నారు. అవసరమైన నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. కొత్తగా నిర్మించే విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల కోసం స్థలం సేకరించాలని అన్నారు. ఉదయం, సాయంత్రం నగరంలో క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలని, రోడ్లపై చెత్త వేసేవారిపై జరిమానాలు విధించాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలన్నారు. అనంతను సుందరనగరంగా తీర్చిదిద్దడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక

కనగానపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పరిటాల భవన్‌లో గురువారం టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి పార్టీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. యలక్కుంట్ల, కొండపల్లి, బద్దలాపురం గ్రామాల కమిటీలను ఎంపిక చేసి సభ్యులను అభినందించారు. అనంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బిల్లే భాస్కర్, క్లస్టర్ ఇంచార్జి పూజారి రాజాకృష్ణ, తెలుగుయువత నాయకుడు బట్టా సురేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో జయసూర్యమ్మ ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో జయసూర్యమ్మ ప్రతిభచాటింది. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ ఓపెన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో స్పీడ్‌స్కేటింగ్ విభాగంలో నగరానికి నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న ముత్యాలయ్య, రోహిణి దంపతుల కుమార్తె జయసూర్యమ్మ విజేతగా నిలిచింది. స్పీడ్ స్కేటింగ్‌లో పతకం సాధించిన జయసూర్యమ్మను కోచ్ నాగేంద్ర అభినందించారు.


బండి జయసూర్యమ్మ

చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
● మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా హాజరై నగరపాలక కమిషనర్ బాలస్వామితో కలిసి 120మంది రిసోర్స్ పర్సన్లకు వాటిని పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల నిర్వహణ, ప్రభుత్వ పథకాల నిర్వహణ ఆన్‌లైన్‌లో చేపట్టేందుకే ఈ ట్యాబ్‌లు అందజేస్తున్నారన్నారు. విజినరీ సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన డ్వాక్రా సంఘాలు దేశంలోనే ఆదర్శం గా నిలిచాయన్నారు. మన రాష్ట్రంలోని మహిళలు ఉపాధిపై ఇతర రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చే స్థాయికి ఎదగడం శుభపరిణామమన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే త్వరలోనే ప్రతి మహిళలకు నెలకు రూ.1500చొప్పున అందజేసే కార్యక్రమాన్ని కూడా సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత స్వయం సహాయక సంఘాల మహిళలే తీసుకోవాలని సూచించారు. శ్రీశక్తిని గుర్తించి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో మెప్మా పీడీ విశ్వజ్యోతి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, సీఎంఎం కాటమయ్య, కార్పొరేటర్లు బాలాంజనేయులు, బాబా, నాగసుధ, డైరెక్టర్లు నరసింహ, మూర్తి, కొండన్న, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.


విశాఖలోని ర్యాలీలో పూలనాగరాజు, మంత్రి సవిత


గాజువాకలో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి


అనంతపురంలో సమావేశమైన నాయకులు

యోగా డేను విజయవంతం చేద్దాం

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ నాగరాజు పిలుపు

అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా డేను అందరం కలిసి విజయవంతం చేద్దామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పిలుపునిచ్చారు. విశాఖపట్టణంలోని యలమంచిలి మెయిన్ రోడ్డులో గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఇందులో ముఖ్యఅతిథులుగా మంత్రులు సవిత, సత్యకుమార్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ నాగరాజు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆదారి మంజు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ అధ్యక్షుడు ధూళి రంగనాయకుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ మాట్లాడుతూ.... వైజాగ్‌లో ఈ గొప్ప వేడుక జరుగుతుండటం ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, అందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యోగాడే విజయవంతంపై కసరత్తు

అనంతపురం క్రైం: యోగాడే విజయవంతంపై జిల్లా టీడీపీ నాయకులు, పరిశీలకులు కసరత్తు చేశారు. వేడుకకు జిల్లా టీడీపీ నేతలను పరిశీలకులుగా నియమించడంతో జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం వారు సమావేశం నిర్వహించి కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇందులో మాజీ ఎమ్మెల్సీ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కొడుమూరు నియోజకవర్గ పరిశీలకులు రామలింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటప్ప పాల్గొన్నారు.

గాజువాకలో ప్రభాకర్ చౌదరి

గాజువాకలో జరిగిన యోగాంధ్రలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి ప్రభాకర్ చౌదరి, ఎంపీ భరత్, ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొన్నారు. 21న జరిగే యోగాడేను విజయవంతం చేయాలని ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు.

బాధిత టీచర్లకు న్యాయం చేయాలి: ఏపీటీఎఫ్

అనంతపురంవిద్య, జూన్19(ఆంధ్రజ్యోతి) బదిలీలు, పదోన్నతులలో అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో గురువారం ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు రాయలవెంకటేశులు, జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, సీనియర్ రాష్ట్రనాయకులు నరసింహులు మాట్లాడుతూ బదిలీలలో తప్పిదాలు జరిగి అనేకమంది టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతులు ఇచ్చినా పట్టించుకోకుండా అధికారులు బదిలీలు, పదోన్నతులు నిర్వహించారన్నారు. అసంబద్ధ జీఓలు, నిర్ణయాలు, గంటగంటకు మార్పులు చేయడం వల్లనే అనేకమంది టీచర్లు అన్యాయానికి గురయ్యారన్నారు. ఎంతోమంది బదిలీపై వెళ్లినా అక్కడ పోస్టులు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వారందరికీ జీతాల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సర్దార్‌వలి, బీవీరమణ, వన్నప్ప, ఎల్లప్ప, చిదంబరయ్య, అడవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖర్జూర పంటను పరిశీలించిన ఎమ్మెల్యే

రామగిరి, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లిలో రైతు నారాయణప్ప కుటుంబసభ్యులు సాగుచేసిన బార్హీ రకం ఖర్జూరపు పంటను ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతుతో మాట్లాడుతూ.. పంటకు ఎంతమాత్రం పెట్టుబడులు పెట్టింది. దిగుబడులు ఏమాత్రం వచ్చేది అడిగి తెలుసుకున్నారు. బార్హీ రకం సౌదీఅరేబియా వారితో ఎంఓయూ చేసుకుని ఒక మొక్కను రూ.3600 చొప్పున రవాణాతో కలిపి కొనుగోలు చేసినట్టు రైతు తెలిపారు. ఒక ఎకరానికి 75 నుంచి 100 మొక్కలు నాటవచ్చని అన్నారు. ఎకరానికి రూ.5.40లక్షలు పెట్టుబడి వస్తుందన్నారు. మూడేళ్లకు పంట కాపునకు వస్తుందని, పెట్టుబడి పోయి ఎకరాకు రూ.3లక్షలకు పైగా ఆదాయం వస్తుందని చెప్పారు. దీంతో రైతు కుటుంబాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఎడారి ప్రాంతాల్లో పండించే పంటలను ఇక్కడ కూడా పండించడం సంతోషకరమన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు ప్రభుత్వం సహకారం అందిస్తే ఎలాంటి పంటలైనా పండిం చగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు పాపిరెడ్డిపల్లి రమేశ్, సుబ్రమణ్యం, జోగి అంజినప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డేకు నిధులు కేటాయింపు హర్షణీయం

అనంతపురం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ దినోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షణీయమని ఏపీ జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఎన్.దివాకర్ రావు రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి సోమశేఖర్, కోశాధికారి పునీత్‌బాబుతో కలిసి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల రెవెన్యూభవన్‌లో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహించనున్నామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ దినోత్సవాన్ని జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. అహర్నిశలు ప్రజాసేవలో నిమగ్నమయ్యే రెవెన్యూ ఉద్యోగులకు రెవెన్యూ డే ద్వారా గుర్తింపునివ్వడం హర్షణీయమని అన్నారు.

స్వచ్ఛ సురక్ష గ్రామీణ్‌పై వర్క్‌షాప్

అనంతపురం న్యూటౌన్ జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని పంచాయతీ వనరుల కేంద్రం సమావేశ భవనంలో గురువారం డీపీఓ నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బందికి వర్క్‌షాప్ జరిగింది. ఇందులో జిల్లాలో స్వచ్ఛ సురక్ష గ్రామీణ్ ద్వారా చేపట్టే అంశాలపై డీపీఓతో పాటు జెడ్పీ సీఈఓ శివశంకర్ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ నుంచి టీమ్‌లు గ్రామాల్లోకి వస్తాయని, కనుపరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరం ఉన్న చోట మొక్కలు నాటించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారారులు పాల్గొన్నారు.

పాలసీ చేయిస్తానని చీటింగ్

అనంతపురం క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాలసీలు చేయిస్తానని ఓ ఇన్సూరెన్స్ ఏజెంట్ చీటింగ్ చేయడంతో టూ టౌన్ పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. స్థానిక సాయినగర్ 8వ క్రాస్‌కు చెందిన సుజాతకు మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ మల్లికార్జున పాలసీలు చేయిస్తానని చెప్పడంతో సుజాత కుటుంబీలు డబ్బులు ఇచ్చారు. అయితే రెండు ఫేక్ పాలసీలు చేసి, 3 పాలసీల చేసినట్లు నమ్మబలికాడు. ఇటీవల సమస్యలతో పాలసీ డబ్బులు క్లైం చేసుకోడానికి వెళ్లిన సుజాతకు అసలు విషయం తెలిసింది. 2 ఫేక్ పాలసీలు ఉన్నట్లు తేలిపోవడంతో టౌటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు ఏజెంట్ మల్లికార్జునపై కేసు నమోదుచేశారు.

వాచ్‌మన్ మిస్సింగ్‌పై కేసు నమోదు

అనంతపురం క్రైం: నగరంలోని ఎస్కేడీ స్కూల్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆనంద్‌కుమార్(50) ఈనెల 17వ తేదీ నుంచి కనిపించలేదు. 16న రాత్రి డ్యూటీ చేసిన ఆయన 17న ఉదయం భార్యకు టీ తెచ్చేందుకు స్కూటర్‌పై బయటికి వెళ్లాడు. తర్వాత తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య మణికుమారి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసుల కేసు నమోదు చేశారు.

యాసిన్‌పై కేసు నమోదు

అనంతపురం క్రైం: రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన యాసిన్‌పై టూటౌన్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. రాంనగర్‌కు చెందిన మహమ్మద్ యాసిన్ రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ట్రాఫిక్ సీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారులు పట్టభద్రులయ్యారు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్

అనంతపురం వైద్యం, జూన్ 19(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులు పట్టభద్రులయ్యారు. ఎర్రనేల కొట్టాల అంగన్వాడీకేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌డేకు సీడీపీఓ అనురాధ హాజరై చిన్నారులతో ముచ్చటించారు. పాఠశాల, కళాశాల వరకు చిన్నారులు విద్యను కొనసాగించేలా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, హేమలత, వర్కర్లు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులైన సాయికిరణ్, ప్రవీణ్ అనే యువకులు పని నిమిత్తం మర్తాడుకు బైక్‌పై వెళ్లారు. పని అనంతరం తిరిగి వస్తుండగా.. ఇందిరమ్మ కాలనీ వద్ద మరో వ్యక్తి బైక్‌పై ఎదురుగా వచ్చి ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. ప్రమాదంలో సాయికిరణ్, ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రామగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత వెంకటాపురంలో గల తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానికురాలైన వడ్డేపూజ అనే చిన్నారికి రూ.1.13లక్షలు, పెద్దకొండాపురం గ్రామానికి చెందిన సుధాకర్‌కు రూ.59వేలు, కనగానపల్లి మండలం ముత్తవకుంట్లకు చెందిన రామాంజనేయులుకు రూ.21వేలు మంజూరవగా... అందుకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు పరిటాల సుబ్రమణ్యం, పేరూరు సాగునీటిసంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: నియోజవర్గవ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన 17మందికి రూ.17,28,77లు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.


వెంకటాపురంలో చిన్నారికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


అనంతపురంలో చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు ఘన నివాళి


జిల్లా గ్రంథాలయంలో ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు,ఉద్యోగులు

అనంతపురం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద గురువారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రి వెలుపల దాదాపు 350 మందికి అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, సభ్యుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురం వైద్యం: నగరంలోని పలు సంఘాల నాయకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి, విగ్రహాలకు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బహుజన లాయర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, నాయకులు పాల్గొన్నారు

●అనంతపురం విద్య: స్థానిక జిల్లా గ్రంథాలయ ఆవరణలోగల ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి అక్కడి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాల వేసి ఘననివాళులర్పించారు.

24న ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ ద్విచక్ర వాహనాలను ఈనెల 24న వేలం వేయనున్నట్లు సీఐ జగదీష్ గురువారం ప్రకటనలో తెలిపారు. స్టేషన్‌లో ఉన్న 23 వాహనాలను మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ. 3 వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునన్నారు. వేలం ముగిసిన తర్వాత వేలంలో దక్కని వారికి డిపాజిట్ వెనక్కు తిరిగి చెల్లిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 9346010581, 9346917088 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

15 రోజుల్లో ఓటరు కార్డు ఇంటికి..

శింగనమల జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎవరైనా ఓటరు (ఎపిక్) కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే.. 15 రోజుల్లోగా ఆ కార్డు వారి ఇంటికి చేరుతుందని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్లు జాబితాపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అలాగే నూతన ఓటర్లను చేర్చడానికి నిరంతర పక్రియ కొనసాగుతుందన్నారు. ఎవరైనా ఎపిక్ (ఓటర్) కార్డు కావాలని దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లోపు ఇంటికి చేరుతుందని అన్నారు. నాయకులు చిన్నప్పయాదవ్, ఆదినారాయణ, ఎన్వీ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

నేడు గూగూడు ఆలయ హుండీల లెక్కింపు

నార్పల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయి స్వామి ఆలయంలోని హుండీలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ శోభ గురువారం ప్రకటనలో తెలిపారు. భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కిస్తామన్నారు. అలాగే ఆలయంలో తలనీలాలు పోగు చేసుకునేందుకు, చెక్కర పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని అన్నారు.

పాలిసెట్‌పై అవగాహన సదస్సు

అనంతపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరురోడ్డులో గల పీవీకేకే పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం పాలిసెట్-2025పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జేవీ సురేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కోర్సుల ఎంపిక చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్‌లోని కోర్సులు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రశ్నలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పీవీకేకే ఐటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ కౌన్సెలింగ్ సమయంలో కళాశాల ఎంపిక గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేష్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, ఐటీ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీ మాజీ సర్పంచ్ మృతి


హుస్సేన్ (ఫైల్)

అనంతపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాజీవ్ కాలనీ మాజీ సర్పంచు హుస్సేన్ గురువారం తెల్లవారుజామున గుంటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం ఆయన మరో వ్యక్తితో కలిసి విజయవాడకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో భాగంగా బుధవారం అక్కడి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కారు. కొంతదూరం ప్రయాణం చేశాక టికెట్లు ఖరారు కాకపోవడంతో మరో స్టేషన్‌లో దిగి ఆర్టీసీ బస్సులో అనంతపురానికి బయలుదేరారు. అయితే గుంటూరు- ప్రకాశం జిల్లా సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మొదటి నుంచి సీపీఐలో పనిచేస్తున్న ఈయన 2019లో వైసీపీలోకి వెళ్లారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

అనంతపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేటకు చెందిన టీడీపీ నాయకుడు బానుకోట శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ గురువారం అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు నారాయణస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

22న క్రికెటర్ల ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సేవ్ ఆర్డీటీ పేరుతో ఈనెల 22వతేదీన నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెటర్లు తెలిపారు. స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో గురువారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌ఆర్‌సీఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ ఈనెల 22న ఉదయం 8 గంటలకు టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వద్ద ఉన్న విన్సెంట్‌ఫెర్రర్ విగ్రహం వరకు తాము ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి, రంజీ మాజీ ప్లేయర్లు షాబుద్దీన్, సురేష్, రాష్ట్ర మాజీ క్రీడాకారులు మచ్చా రామలింగారెడ్డి, రవీంద్రనాథ్ రావు, కమలాకర్ నాయుడు, సీనియర్ ప్లేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పనుల పరిశీలన

అనంతపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు జాతీయస్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం రానున్నట్లు ఎంపీడీఓ దివాకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్ పంచాయతీలో సీసీ రోడ్డు, కొడిమిలో బీటీరోడ్డు, కందుకూరులో జరిగిన పలు పనులను వారు పరిశీలించనున్నట్లు చెప్పారు.

అందని తల్లికి వందనం

రీ సర్వేలో లోపాలే కారణం

కణేకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో సమస్యల వల్ల తల్లికి వందనం పథకం అందక అనేక మంది మహిళలు తహసీల్దార్, సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఈ పథకం లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ఆయా సచివాలయాల్లో ఏర్పాటు చేసింది. అనేక మందికి అధిక స్థలాలు ఉన్నాయని, దీంతో వారిని అనర్హులకు ఆ జాబితాలో చూపించారు. క్షేత్రస్థాయిలో వారికి భూమి తక్కువగా ఉన్నా.. రికార్డుల్లో మాత్రం 10 ఎకరాల పైబడి ఉన్నట్లు నమోదయ్యాయి. దీంతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా గుర్తించారు. ప్రధానంగా గతంలో రీ సర్వేలు చేసిన గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి అధికంగా ఉంది. గ్రామాల్లో భూమి సర్వే చేసినపుడు కొన్ని భూములకు సమస్యలు ఉండటంతో వాటిని పెండింగ్‌లో ఉంచారు. అలాంటి వారికి భూములు అధిక విస్తీర్ణంలో ఉన్నట్లు నమోదయ్యాయి. దీంతో అనేక మంది తల్లికి వందనం పథకానికి అన్ని అర్హతలు ఉన్నా.. వారికి తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదు. దీంతో రెవెన్యూ అధికారుల ద్వారా తమకు క్షేత్రస్థాయిలో ఎంతమేర భూమి ఉందో వాస్తవ సర్టిఫికెట్లు తీసుకొని.. వాటిని సచివాలయాల్లో అందించాల్సి ఉంది. ఈ వాస్తవ సర్టిఫికెట్ల కోసం అనేక మంది బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద భూ సర్టిఫికెట్ల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

న్యూస్ బాక్స్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ దీక్షకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవీఎల్ స్వామిదాసు, ఏపీ సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై శ్రీనివాసులు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు ఆదినారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహేంద్ర, జిల్లా నాయకులు ఫిరోజ్‌ఖాన్, సీనియర్ నాయకులు ఆలం నవాజ్, పలు కులసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు మల్లేష్, నాయకులు టీజీ సురేష్, మస్తాన్, సురేంద్ర, సుంకన్న, నరేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా పుణ్యవతి



గుత్తి/రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గుత్తి తహసీల్దార్‌గా పుణ్యవతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ ఓబులేసు విడపనకల్లుకు బదిలీ కాగా.. అయిన స్థానంలో బుక్కరాయసముద్రం నుంచి పుణ్యవతి ఇక్కడి వచ్చారు.



● డీ.హీరేహాళ్: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. గుమ్మఘట్ట నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించేవారు.

పనుల పరిశీలన

తాడిపత్రి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్మశాన వాటికలో చేపట్టిన పనులను ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ పనులను వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు. పట్టణంలోని నందలపాడు, జూటూరు కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి.. ప్రజా సమస్యలపై ఆరా తీశారు.

నేడు యూనిఫాంల పంపిణీ

బొమ్మనహాళ్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో 15 ప్రభుత్వ పాఠశాలల్లోని 9,296 మంది విద్యార్థులకు యూనిఫాంలు మండల విద్యా కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. వాటిని శుక్రవారం ఆయా పాఠశాలలకు అందజేస్తామన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

గుంతకల్లుటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లోని కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేశా రు. కార్యక్రమంలో నాయకులు ఎం మహేంద్ర, షేక్ ఆలం నవాజ్, ఫిరోజ్ ఖాన్, నబీరసూల్, ఖాదర్‌వలి, నరసన్న, రామచంద్ర పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


వెంకటేశులు

బెళుగుప్ప, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వెంకటేశులు అనారోగ్యంతో బుధవారం రాత్రి మరణించాడు. పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

నాటుసారాను నియంత్రించండి

జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



గుంతకల్లుటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీని నియంత్రించేలా ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం నవోదయ 2.0 నిర్మూలన ప్రత్యేక కార్యక్రమంపై అనంతపురం, కర్నూలు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనమంతరావుతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఏఈఎస్‌లు రాజశేఖర్ గౌడ్, శ్రీరామ్, గుంతకల్లు సీఐ శివసాగర్, అనంతపురం స్క్వాడ్ సీఐలు జయనాథ్‌రెడ్డి, సుహాసిని, కర్నూలు సీఐ జయరాం నాయుడు పాల్గొన్నారు.

● ఉరవకొండ: పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తనిఖీ చేశారు. సరిహద్దు ప్రాంతంలో పటిష్ట నిఘా ఉంచి కర్ణాటక నుంచి మద్యం రాకుండా అరికట్టాలన్నారు. అలాగే విడపనకల్లు మండలంలోని డొనేకల్లు, విడపనకల్లు చెక్‌పోస్టులను పరిశీలించారు. ఆయన వెంట ఏఈఎస్ శ్రీరామ్, సీఐ రవిచంద్ర, చెక్‌పోస్టు ఎస్ఐ వీరస్వామి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కార్మికుల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

గుత్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు పట్టణంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు రాజా, రవి, ఉపాధ్యక్షుడు మురళీ, నాయకులు నరసింహ, ఆది, పారిశుధ్య కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, రామాంజినేయులు, మహేష్, సుంకన్న పాల్గొన్నారు.

చిరుధాన్యాల కిట్ల పంపిణీ


రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న మాంచో ఫెర్రర్

కుందుర్పి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతులకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ చిరుధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. దాదాపు నాలుగు క్వింటాళ్ల చిరుధాన్యాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్, సీఈఓ డీఎం నరసింహమూర్తి, కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు వైటీ ఓబయ్య, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షుడు లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

కూడేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గొట్కూరు, కూడేరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం తనిఖీ చేశారు. సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల నాణ్యతను పరిశీలించారు. పంపిణీ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆమె వెంట టెక్నికల్ ఏఓ రాకేష్ నాయక్, మండల ఏవో శుభకర్, ఏఈఓ రాఘవేంద్ర ఉన్నారు.

కార్యకర్తల త్యాగాలను మరువలేం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం కార్యకర్తలు అనేక కష్టాలు అనుభవించారు. అక్రమ కేసులు బనాయించినా .. పార్టీ కోసం భరించారు. అనేక త్యాగాలు చేసిన అలాంటి కార్యకర్తలను పార్టీ ఎప్పటికీ మరువదు. తగిన ప్రతిఫలం తప్పక లభిస్తుంది.' అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బూత్ కన్వీనరుగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన వారికి సైతం కౌన్సిలరు టిక్కెట్లు ఇవ్వడానికి వెనుకాడనన్నారు. పార్టీ కోసం పనిచేయడానికి, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి రాజీపడని వారు మాత్రమే కన్వీనరు పదవులను స్వీకరించాలన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా విజయం తథ్యమని, వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని అన్నారు. అనంతరం గుంతకల్లు పట్టణ, మండల కమిటీలకు అభ్యర్థుల దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో అబ్జర్వర్లు తిమ్మయ్య చౌదరి, తులసిరెడ్డి, పర్వీన్ బాను, శ్రీధర్‌బాబు, ఆవుల కృష్ణయ్య పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టమే ఫైనల్


మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకురాలు స్వప్న

గుమ్మఘట్ట, జూన్19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకే మండల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేస్తామని పార్టీ పరిశీలకురాలు, రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి స్వప్న స్పష్టం చేశారు. టీడీపీ మండల కమిటీల ఏర్పాటుపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి కార్యకర్తల సూచన మేరకే అధిష్టానానికి సిఫార్సు చేస్తామన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పదవులు రాకున్నా.. నిరుత్సాహ పడకుండా.. అందరూ సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ గిరిమల్లప్ప, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ దానవేంద్ర, బీటీ ప్రాజెక్ట్ కాలవ రాజు, టీడీపీ యూత్ అధ్యక్షుడు గోనబావి రమేష్, సర్పంచులు విజయలక్ష్మి, నాగరాజు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారులను పాఠశాలకు తీసుకెళ్తున్న అంగన్‌వాడీలు

పిల్లలకు ప్రమోషన్

కూడేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం చేర్పించారు. ఆ చిన్నారులను అంగన్‌వాడీలు పాఠశాలకు తీసుకొని వెళ్లగా.. అక్కడ ఉపాధ్యాయులు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పారిజాత, నిర్మల, చింతలమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

హెచ్చెల్సీని బాగు చేయండి



సమస్యలు వివరిస్తున్న యర్రగుంటపల్లి సర్పంచ్ యుగంధర్

తాడిపత్రి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీని బాగు చేసి.. పొలాలకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని యర్రగుంటపల్లి సర్పంచు యుగంధర్ అధికారులను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన నిర్వహించారు. యర్రగుంటపల్లి సర్పంచు మాట్లాడుతూ.. హెచ్చెల్సీ కింద దాదాపు 32 వేల ఎకరాలు ఉన్నాయని, కాలువలో ముళ్లపొదలు భారీగా పెరిగాయని, కొన్ని డిస్ట్రిబ్యూటర్ల వద్ద గేట్లు పూర్తిగా విరిగిపోయాయని, ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాగా సమావేశానికి హెచ్చెల్సీ అధికారులు రాకపోవడంతో ఎంపీడీఓ ఫజుల్‌బాషా ఈ సమస్యలను ఆ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశువులు ఎక్కువశాతం మృత్యువాత పడుతున్నాయని బొందలదిన్నె ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల ఇంజనీర్ సురేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఆంజనేయులు, ఎంఈఓ నాగరాజు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మమ అనిపించారు..!

పుట్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు.. ప్రజా ప్రతినిధులు ఏ ఒక్క ప్రజా సమస్యపై కూడా చర్చించకుండా మమ అనిపించారు. మండల స్థాయి అధికారులు ఎక్కువ మంది హాజరుకాకపోవడంతో.. వచ్చిన వారిలో కొందరు అధికారులు ఫోన్లలో మాట్లాడుతూ కాలక్షేపం చేసి.. వెళ్లిపోయారు.

క్రైం న్యూస్..

మరో గడ్డివామి దగ్ధం

యాడికి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు మాదాసు రామిరెడ్డికి చెందిన రూ.లక్ష విలువైన గడ్డివామిని బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేసిన విషయం తెల్సిందే. గురువారం తెల్లవారుజామున అదే రైతుకు చెందిన మరో గడ్డివామిని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీంతో మొత్తం తనకు రూ. 1.60 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

తాడిపత్రి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జయనగర్‌కాలనీకి చెందిన ఆదిలక్ష్మి, లక్ష్మీనారాయణరెడ్డి కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. గురువారం హెల్మెట్ పెట్టుకొని మోటార్ సైకిల్‌లో ఆ దుకాణానికి వచ్చిన ఇద్దరు యువకులు.. ఆదిలక్ష్మి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై వెళ్లిపోయారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

డీ.హీరేహాళ్, జూన్19(ఆంధ్రజ్యోతి): బళ్లారి-బెంగళూరు జాతీయ రహదారిలో బళ్లారి నుంచి రాంపురం వైపునకు ఒక ఐచర్ వాహనంలో తరలిస్తున్న 134 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా తన సిబ్బందితో గురువారం స్వాధీనం చేసుకున్నాడు. ఆ వాహనాన్ని, డ్రైవర్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డమ్మీ మీటర్ దారుడికి రూ.5.44 లక్షల జరిమానా

కణేకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ వాటర్‌ప్లాంట్‌లో డమ్మీ మీటర్ ద్వారా విద్యుత్ అక్రమాలకు పాల్పడిన వ్యక్తికి అధికారులు రూ. 5.44 లక్షల జరిమానా విధించారు. రెండురోజుల క్రితం విజిలెన్స్ డీఈ రాజేష్ తన సిబ్బందితో కణేకల్లులో తనిఖీ చేసిన విషయం తెల్సిందే. ఓ వాటర్‌ప్లాంట్ యజమాని డమ్మీమీటర్‌ను ఏర్పాటు చేసుకొని.. ఏడాది నుంచి కేవలం నెలకు రూ. 950 మాత్రమే విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దాదాపు 19 వేల యూనిట్లకు సంబంధించి మోసానికి పాల్పడినట్లు నిర్ధారించారు. అందుకు సంబంధించి రూ. 5.44 లక్షలు బిల్లు చెల్లించాలని ఆ వాటర్‌ప్లాంట్ యజమానికి గురువారం నోటీస్ పంపినట్లు ఏఈ శంకర్‌నాయక్ తెలిపారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

అనంతపురం న్యూటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూర్ మండలం రూపానాయక్ తండా సర్పంచ్ శివాజీనాయక్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీఓ నాగరాజ నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం వార్డు సభ్యులకు తెలియకుండా సర్పంచ్, గతంలో అక్కడ పని చేసిన కార్యదర్శి ఇష్టారాజ్యంగా పనులు చేశారు. దీనిపై వార్డు సభ్యులు డీపీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అనంతరం వచ్చిన నివేదిక ఆధారంగా ఆ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు

తాడిపత్రి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పలువురు చౌకధాన్యపు డీలర్లు తూకాలు తక్కువగా వేస్తున్నారని ఫిర్యాదు అందాయని, తమ తనిఖీలో అది రుజువైతే ఆ డీలర్ల చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ సోమశేఖర్ గురువారం హెచ్చరించారు. ప్రతి చౌకధాన్యపు డీలర్ జూలై ఒకటో తేదీ నుంచే రేషన్ పంపిణీ చేయాలన్నారు. డీలర్లు తూకాలు తక్కువేస్తే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయాలన్నారు. రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

15 రోజుల్లో ఓటరు కార్డు ఇంటికి..

శింగనమల జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎవరైనా ఓటరు (ఎపిక్) కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే.. 15 రోజుల్లోగా ఆ కార్డు వారి ఇంటికి చేరుతుందని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అలాగే నూతన ఓటర్లను చేర్చడానికి నిరంతర పక్రియ కొనసాగుతుందన్నారు. ఎవరైనా ఎఫిక్ (ఓటర్) కార్డు కావాలని దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లోపు ఇంటికి చేరుతుందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కూడేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌సీసీ నగర్ సమీపాన అనంతపురం-బళ్లారి రహదారిపై ఆటో బోల్తా పడి యువకుడు షేక్షావలి (28) మృతి చెందగా, మంజునాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన షేక్షావలి, మంజునాథ్, గౌస్ గురువారం ఆటోలో ఉరవకొండలోని కోర్టుకు హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. గొట్కూరు గ్రామ సమీపంలోని ఎస్‌సీసీ నగర్ వద్దకు రాగానే ఆటో బోల్తా పడింది. అందులోని షేక్షావలి అక్కడికక్కడే మృతిచెందగా, మంజునాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే మంజునాథ్‌ను 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. గౌస్ సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరు..

కణేకల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవడికి గ్రామ సమీపాన గురువారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపారు. జక్కలవడికికి చెందిన బోయ ఆంజనేయులు (55), లోక్‌నాథ్‌రెడ్డి పొలాలకు ద్విచక్రవాహనాల్లో వెళ్లి వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. బోయ ఆంజనేయులును బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లోక్‌నాథ్‌రెడ్డి బళ్లారిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


హుస్సేన్‌బాషా (ఫైల్)

తాడిపత్రి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన హుస్సేన్‌బాషా (25) గురువారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఇమాంహుస్సేన్, షబీరా దంపతుల రెండో కుమారుడు హుస్సేన్‌బాషా. ఇతడు ఐటీఐ పూర్తి చేసి పలు ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. ఎక్కడా ఉద్యోగం రాకపోవడంతో ఏదైనా ఒక షాపులో పని నేర్చుకొని, వ్యాపారం ప్రారంభించాలనే ఆలోచనలో ఉండేవాడు. అయితే నష్ట భయం వెంటాడుతుండేది. ఈక్రమంలో ఉద్యోగం రాక, వ్యాపారం చేస్తే నష్టపోతామేమోనని భయంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలోనే రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తండ్రి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

చేతి కందే ఎత్తులో ప్రమాదం


తక్కువ ఎత్తులో ఉన్న ఫ్యూజులు

కూడేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సచివాలయం వద్ద చేతికందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు ఏర్పాటు చేశారు. కమ్మూరు, అరవకూరు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ సచివాలయం వద్దకు వస్తుంటారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉండి.. ఆ ఫ్యూజులను తాకినా.. ప్రాణహాని తప్పదు. వర్షాకాలం కావడంతో ప్రమాదం జరిగే అవకాశముందని, ఫ్యూజులను ఎత్తులో ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విన్సెంట్ ఫెర్రర్‌కు ఘన నివాళి





ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 16వ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు గురువారం పలువురు నివాళులర్పించారు. ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎస్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని కోరారు. కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రి వద్ద ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేపట్టారు. కుందుర్పిలో నిర్వహించిన కార్యక్రమంలో మాంచో ఫెర్రర్ పాల్గొన్నారు. కణేకల్లులో మాల, మాదిగ జిల్లా ఉపాధ్యక్షుడు బాల రామాంజినేయులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అలాగే యాడికి, ఉరవకొండ, వజ్రకరూరు, కణేకల్లు, గుంతకల్లు, బొమ్మనహాళ్, బెళుగుప్ప మండలాల్లోనూ పలువురు నివాళులర్పించారు.





ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం, గుంతకల్లు ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత కింద చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గుంతకల్లు ప్రభుత్వ ఐటీఐ ఇన్చార్జి ప్రిన్సిపాల్ వరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జులై 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ప్రభుత్వ ఐ టీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు.

● ఉరవకొండ : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడతలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ మహబూబ్ బీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 16వ తేదీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. 21న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని, మరిన్ని వివరాలకు 99851 46746, 99493 61066 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

● ఉరవకొండ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదినారాయణ తెలిపారు. బీఏ, బీ కాం, బీఎస్సీ బీకాం కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పీఏబీఆర్ నీటిలోకి వెళ్లకండి

కూడేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాంను చూడటానికి వచ్చిన పర్యాటకులు నీళ్లలోకి వెళ్లడాన్ని పూర్తిగా నిషేధించామని సీఐ రాజు గురువారం తెలిపారు. ఈత రాకపోయిన నీటిలోకి దిగుతుండటంతో మృత్యువాత పడుతున్నారని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పీఏబీఆర్ నీటిలోకి వెళ్లే మార్గాలను బంద్ చేశామన్నారు.